



31 స్కూటీలు, బైక్‌లు సీజ్



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతలకు భంగం కలి గించే అసాంఘిక శక్తులను ఉపేక్షించమని ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో బుధవారం తెల్లవారుజామున డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది బృందాలుగా ఏర్పడి విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. శాంతి భద్రతలకు భంగం కలి గించే అసాంఘిక శక్తులను ఉపేక్షించబోమని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా చట్ట వ్యతిరేక కార్యక్రమాలను అరికట్టాలంటే ప్రజలు నుంచి సహకారం ఎంతైన అవసరమని ఏదైనా సమాచారం ఉంటే దగ్గరలో ఉన్న పోలీస్ వారికి లేదా, 112 కి సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయన్నారు. జిల్లా వ్యా ప్తంగా వివి ధ ప్రాంతాల్లో నెంబరు ప్లేట్లు లేని ,రికార్డులు లేని 31 స్కూటీలు,బైక్‌లను పోలీసులు సీజ్ చేసినట్టు చెప్పారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని గుర్తించిన ప్రాంతాల్లో అణు వణువు క్షుణ్ణంగా సోదాలు చేసి సారా,అక్రమ మద్యం, మందుగుండు సామగ్రి,అనుమానితవ్యక్తుల ఆరా తీశారన్నారు.

బాబోయ్.. రైలు ప్రమాదం!



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైలు బోగి నుంచి పొగలు వస్తున్నాయి.. మరో వైపు సిబ్బంది అంతా ఉరుకులు పరుగులు పెడుతున్నారు.. కొందరు రక్తం కారుతున్న ప్రయాణికులు కిందకు దించు తుంటే.. మరికొందరు కట్టుకడుతున్నారు.. ఇం కొందరు అంబులెన్స్‌లు ఎక్కించి ఆసుపత్రికి తరలిస్తున్నారు..ఇంకో వైపు రైల్వే సిబ్బంది బోగీ పరిరక్షణ చర్యల్లో ఉన్నారు. బుధవారం ఉద యం 11 గంటలకు రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్ వద్ద ఒక భయానక వాతావరణం సృష్టించారు.స్థానికులంతా ఏదో జరిగిందని అను కుంటున్నారు. కంగారుపడుతు న్నారు.. చివరికి ఇదంతా కోల్ సైడింగ్‌లో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌పీ ఎఆర్ఎంపీ సిబ్బంది మాక్ డ్రిల్ అని తెలియడంతో ఊపిరిపీల్చుకున్నారు. రైలు ప్రమాదాలు జరిగిన సమయంలో ఎంత వేగంగా స్పందిస్తాం అనే దానిని సమర్థవం తంగా చేసి చూపినట్టు ఏడీఆర్ఎం ఆపరేషన్స్ శ్రీనివాస కొండ తెలి పారు. రైలు ప్రయాణాన్ని చేసేట ప్పుడు ప్రయాణికులు చేయవలసిన , చేయకూడని పనులు వివరించారు.జేసీ చిన్ని రాముడు మాట్లా డుతూ ప్రమాదాల సమ యంలో ఎంత వేగంగా స్పందిస్తే అంత తక్కువ సంఖ్యలో ప్రజలను రక్షిం చవచ్చని చెప్పారు. 100 మంది రైల్వే సిబ్బంది, రెస్క్యూ బృందాలు మాక్‌డ్రిల్‌లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ ఎం.సుజీ, సీనియర్ డీఎస్‌వో బి.ప్రశాంత కుమార్, సీనియర్ డీఎంఈ ఏ.సంజయ్, డీఈ ఎన్ నార్త్ సిహెచ్ గోతం, డీసీఎం ఎండి అలీఖాన్, డీఈఈ గురు శ్రీనివాస్, డీఎస్‌టీఈ జె.నారాయణరావు ,ఏడీఎంఈ సీఎన్‌డబ్ల్యూ డిఆర్ రాజేష్, ఏడియన్ ముత్యాలరావు, ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ ,రాజీబ్ దర్భియా ఎస్‌సీఆర్ కెఎల్ఎన్ స్వామి, సివిల్ డిఫెన్స్ ఎస్‌సీఆర్ డీవై కంట్రోలర్ టి.సుధీర్‌బాబు, వి.కళ్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే బత్తుల భేటీ

రాజానగరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలపై సీఎం చంద్రబాబు నాయుడితో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బుధవారం భేటీ అయ్యారు. నియోజకవర్గంలో తాగు, సాగు నీరు, పురుషోత్తపట్నం భూముల నష్ట పరిహారం,కోరుకొండ భూముల రిజిస్ట్రేషన్ సమస్యలు, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు, పీహెచ్‌సీల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను సీఎం చంద్రబాబు నాయుడికి వివరించి వినతిపత్రం అందజేశారు. సీఎం సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కరించే దిశగా హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే బత్తుల తెలియజేశారు.

పుష్కర పనులు ఆరంభించాలి అసెంబ్లీలో ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గోదావరి పుష్కరాలకు వచ్చే యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఇప్పటినుంచే పుష్కర పనులను ప్రారంభించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు 8వ రోజు బుధవారం 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలపై అసెంబ్లీలో ప్రస్తావించారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి దేశ నలుమూలల నుంచి యాత్రికులు లక్షలాదిగా తరలివస్తారన్నారు. కొవ్వూరు పట్టణాభివృద్ధికి అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. వచ్చే పుష్కరాలకు రోజుకు 12.50 లక్షల మంది, 12 రోజులకు 1.50 కోట్ల మంది యాత్రికులు వస్తారని అంచనా అన్నారు. ప్రస్తుతం కొవ్వూరులో 11 గోదావరి స్నానఘట్టాలు ఉన్నాయని, వాటికి అదనంగా మరో 3 స్నానఘట్టాలు నిర్మించాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డిసెంబరు 5న బ్యాలెట్ పేపరు ఉపయోగించి టీచర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఏఆర్‌వో, సహాయ ఎన్నికల సిబ్బందికి పోలింగ్ కేంద్రాలు నిర్వహణ, పోలింగ్ విధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఎన్నికలపై అధికారులు, సిబ్బంది స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాలెట్ బాక్సు, బ్యాలెట్ పేపరు ,మార్క్, కాపీ పేపరు, సీల్, మెటల్ సీల్, రబ్బర్ స్టాంప్, ఫారం 14,15,16 పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.శిక్షణ తరగతుల్లో ఆర్‌డీవోలు కృష్ణనాయక్, రాణి సుస్మిత, ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి ఎం.మాధురి ,తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరి ఆరోగ్యం కోసం పనిచేస్తున్న తమకు స్థూలమూల వేతనం చెల్లించాలని వైద్య, ఆరోగ్యశాఖలోని కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులైన ఆరోగ్య సహాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రం ఎదుట ఖాళీపేట్లతో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. గత ప్రభుత్వం జీవో జారీ చేసి చేతులు దులుపుకుని మోసం చేసిందని, తాము అర్ధాకలితో జీవితాలు సాగిస్తున్నామన్నారు.



రుడా నిధులు హాంఫట్!

గత ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో దోపిడీ

- అసంపూర్తిగా పనులు
- అయినా బిల్లులు మంజూరు
- అనపర్తి చెరువులో తినేశారు
- కళావేదికలో మింగేశారు
- వైఎస్ విగ్రహం చుట్టూ సుందరీకరణకు రుడా నిధులే
- సాగుతున్న అక్రమ నిర్మాణాలు
- నేటికీ అడ్డుకోలేని అధికారులు
- కొత్త రుడా కార్యవర్గంపై ఆశలు



నాడు వైఎస్ఆర్ విగ్రహం వద్ద రూ.20 లక్షల పైబడి నిధులతో చేసిన సుందరీకరణ

అనపర్తి,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో అంతా వారిష్టమే.. కావాలంటే పనులు చేశారు.. లేదంటే బిల్లులు చేయించేసుకున్నారు..ఎక్కడికక్కడ ఆక్రమించేసి ఇష్టానుసారం భవనాలు నిర్మించేసుకున్నారు. అయినా అడిగే నాథుడు లేదు.. గత ఐదేళ్లు పట్టించుకున్నవారు లేరు. జిల్లా వ్యాప్తంగా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. రుడా పరిధిలో ఉన్నా అక్రమాలకు అడ్డే లేకుండా పోయింది.. ఇటీవల అనపర్తిలో వెలుగుచూసిన సంఘటన మరో ఉదాహరణ..గత వైసీపీ హయాంలో రాజమహేంద్రవరం రూరల్ డవలప్‌మెంట్ అథారిటీ పేరుతో ఏర్పాటు చేసిన రుడా సంస్థ పరిధిలో చేపట్టిన అనేక నిర్మాణాలు కళ్లకు కట్టినట్లు సాక్షీ భూతాలుగా నిలుస్తున్నాయి.

నాడు నాసిరకంగా పనులు..

రుడాకు సమ కూరిన సొమ్ముల్లో కొంత భాగాన్ని గ్రామాభివృద్ధికి మంజూరు చేస్తారు. పార్కులు, ప్రధాన కూడళ్లలో సుందరీకరణ వంటి పనులు చేస్తారు. గత ప్రభుత్వంలో అనేక నిధులు కేటాయించి నాసిరకంగా పనులు చేసి దోచుకున్నారు.అనపర్తి నియోకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో రుడా నిధులతో నిర్మాణాలు చేపట్టిన అనేక చోట్ల అవినీతి రాజ్యమేలిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆరోపిస్తూ వీటి పై విచారణ చేయాలని అధికారులను కోరారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఇళ్ల స్థలాల్లో భారీ అవినీతి జరిగిందని ఇప్పటికే అసెంబ్లీ సాక్షిగా గళమెత్తారు.అభివృద్ధి పనుల్లో జరిగిన అవినీతిని ప్రస్తుత పాలకులు ప్రశ్నిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా నిధులు..

బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో పెద్ద చెరువును అభివృద్ధి చేయాలన్న తలంపుతో రూ.1.50 కోట్ల నిధులను మంజూరు చేయించారు.ఈ నిధులతో ట్యాంక్‌ను శుభ్రపరచడం.. గట్టును పటిష్ఠ పర్చడం, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం,చిన్నారులు ఆడుకునేందుకు పార్కును ఏర్పాటు చేయడం వంటి పనులకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని కాంట్రా క్టరుకు పనులను అప్పగించారు. అయితే ఈ పనుల పర్యవేక్షణ రుడా రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్‌కు అప్పగించింది.బలభద్రపురం మెట్ట ప్రాంతంలో దిగువ గ్రామం కావడంతో భారీ వర్షాలకు పైనున్న చెరువులు పొంగితే బల భద్రపురంలోని పెద్ద చెరువు గ్రామానికి కాపుకా యడంతో పాటు గ్రామాన్ని ముంపునకు గురి కాకుండా రక్షించేది.అయితే చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా చెరువుకు నీరు వచ్చే మార్గాన్ని ..నీరు బయటకు వెళ్లే మార్గాన్ని మూసివేయడంతో భవిష్యత్‌లో వరదలు వస్తే గ్రామాన్ని రక్షించే పెద్ద చెరువు కూడా రక్షణ కల్పించలేని పరిస్థితి వచ్చిందని గ్రామస్థులు వాపోతున్నారు. అంతే కాకుండా పూర్తి స్థాయిలో పనులు చేయకుండానే బిల్లులు చెల్లింపు జరగడం గమనార్హం. దీనిపై ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులు, కాంట్రాక్టరును ప్రజల వద్దకే రప్పించి చెరువు అభివృద్ధి పనులపై సమీక్ష చేయడంతో అనేక అవకతవకలు బయటపడ్డాయి. అనపర్తి నడి బొడ్డున ఉన్న కళావేదిక అభివృద్ధికి రుడా నుంచి రూ.39 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు రాజమహేంద్రవరానికి చెందిన కాంట్రాక్టరే చేపట్టారు. కళా వేదికకు రెండు వైపులా గోడల నిర్మాణం, సుమారు 20 కిటికీలు, ఐదు గుమ్మాలను యుపీవీసీతో ఏర్పాటు చేసేందుకు రూ.39 లక్షలు మంజూరు చేశారు. ఇంత చిన్న పనికి రూ.39 లక్షలా అంటూ గ్రామస్థులు ముక్కున వేలేసుకుంటున్నారు. అనపర్తి కెనాల్ రోడ్డులో వైఎస్ఆర్ విగ్రహం వద్ద రుడా నిధులు సుమారు 20 లక్షల పైబడి నిధులు వెచ్చించారు. అక్కడ మొక్కలు నాటడం, వాటర్ పొంటేయిన్ ఏర్పాటు చేయడం మినహా అభివృద్ధి చేసిందేముందని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఇలా జిల్లాలో అనేక చోట్ల రుడా నిధులు పక్కదారి పట్టాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం గ్రామంలో అనేక అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. మెయిన్‌రోడ్డును ఆనుకుని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు కన్నెత్తి చూడక పోవడం గమనార్హం.నూతనంగా రుడా బాధ్యతలు చేపట్టబోతున్న కార్యవర్గం గతంలో జరిగిన పనులపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని.. అక్రమ నిర్మాణాల బాధ్యులపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కళావేదిక గోడలకు రూ.39 లక్షలు



అక్రమ నిర్మాణం కూల్చివేత

గోకవరం, నవంబరు20(ఆంధ్రజ్యోతి): గోక వరం మండలం కృష్ణుడిపాలెం గ్రామంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డుగోలుగా నిర్మిం చిన అక్రమ కట్టడాన్ని బుధవారం అధికారులు కూల్చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపం (కొత్తూరు రోడ్డు)లో ఉన్నటువంటి ఖాళీ స్థలంను కొంతకాలం కిందట కొంతమంది వ్యక్తులు ఆక్రమించారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి శివయ్య ఆక్రమణలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. అప్పటి ఎంపీడీవో పద్మజ్యోతి ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. స్థలం ఆక్రమణ సరికాదని ఆదేశాలిచ్చారు. అయి నప్పటికీ గ్రామానికి చెందిన కొందరు రేకుల షెడ్ నిర్మించారు.ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రస్తుత ఎంపీడీవో గోవింద్ ఆదేశాలతో పంచాయితీ కార్యదర్శి రమణ కుమారి పోలీసుల సహకారంతో అక్రమ కట్ట డా న్ని కూల్చి స్థలాన్ని అంగన్‌వాడీకి అప్పగించారు.



వాట్సాప్‌తో ధాన్యం కొనుగోళ్లు

73373 59375 నెంబర్‌కు హాయ్ అని పెడితే సమాచారం

రాజానగరం,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న అన్నదాతకు ఏపీ ప్రభుత్వం తీపి కబురు పంపింది.ధాన్యం విక్రయాల్లో అన్నదాతలు పడుతున్న అవస్థలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయించేలా ప్రత్యేక నెంబరును అందుబాటులోకి తెచ్చింది. అన్నదాతలు ముందుగా ప్రభుత్వం సూచించిన వాట్సాప్ మొబైల్ 73373 59375 నంబరుకు రైతు తన మొబైల్ ద్వారా హాయ్ అని మెసేజ్ చేస్తారు. దీంతో ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థ తక్షణ స్వాగతం పలుకుతుంది. ధాన్యం అమ్మే సమయాన్ని షెడ్యూల్ చేసుకోమని చెబుతుంది. ఇందుకు షెడ్యూల్ బటన్ క్లిక్ చేసి ఆధార్ నంబరును ఎంటర్ చేయాలి. వెంటనే ధాన్యం అమ్మాలనుకున్న కొనుగోలు కేంద్రం పేరును క్లిక్ చేయాలి. మీరు ఏ రోజు ధాన్యాన్ని అమ్మాలనుకుంటున్నారో ఆ తేదీని,ఆ రోజు ఏసమయంలో అమ్మదలచుకున్నారో టైమ్ స్లాట్ ను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు మీరు అమ్మాలనుకున్న ధాన్యం ఏ రకానిదో క్లిక్ చేసి చెప్పాలి. అ తర్వాత ఎన్ని బస్తాలు అమ్మదలచుకున్నారో చెప్పాలి. అంతే మీ ధాన్యం కొలుగోలు ప్రక్రియ నిర్ధారించబడుతుంది.సంబంధిత వివరాలతో పాటు ఒక కూపన్ కోడ్ ఇస్తూ సదరు మొబైల్‌కు ఒక మెస్సేజ్ వస్తుంది. దీని ప్రకారం ఆ సమయానికి వెళ్లి ఎలాంటి నిరీక్షణ లేకుండా ధాన్యాన్ని అమ్ముకోవచ్చు.

ముగిసిన శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించడం ద్వారా వారిని వ్యాధుల బారినుంచి కాపాడవచ్చని జిల్లా ఇన్‌ఛార్జి మలేరియా అధికారిణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జే.సంధ్య అన్నారు.రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో బుధవారం ఆరోగ్యసహాయకులకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. వాతావరణ మార్పులతో సంభవించే వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాలను గ్రామాల్లో ఆరోగ్య సహాయకులు సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు, సీనియర్ ఎంటమాలజిస్ట్ ఐ.రామకృష్ణారావు, ఏపీ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీవీవీ ప్రసాద్, జిల్లాలోని ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రి సమస్యలు పరిష్కరిస్తాం

కార్మిక మంత్రి సుభాష్ హామీ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసౌకర్యాలు కల్పిస్తామని, త్వరలోనే అవసరమైన సిబ్బందిని భర్తీ చేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కార్మిక సంఘాల నాయకులకు హామీ ఇచ్చారు. ఈఎస్ఐ ఆసుపత్రిలో కనీస వైద్య సౌకర్యాలు లేవని, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని మంగళవారం సీపీఐ, ఏఐటీయూసీ, ఇతర కార్మిక సంఘాల నాయకులు ఆందోళనకు దిగిన నేపథ్యంలో మంత్రి సుభాష్ స్పందించారు. ఈ మేరకు సీపీఐ జిల్లా కార్యదర్శి మధు ఒక ప్రకటన విడుదల చేశారు.

రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే పీడీయాక్ట్

జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసాద్

కొవ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ప్రతి నెల 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రసాద్ తెలిపారు. కొవ్వూరులో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దేవరపల్లి, రాజానగరం, పెరవలి, నిడదవోలు, చాగల్లు మండలాల సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ల బృందం కలిసి చాగల్లు మండలం కలవలపల్లి, నిడదవోలు మండలం సూరాపురం గ్రామాల్లో రేషన్ బియ్యం అక్రమ కొనుగోళ్లు, అమ్మకాలపై తనిఖీలు చేపట్టామన్నారు. ఫణికుమార్, మెట్లపర్తి రాజు, కోలా రాజేష్, వద్దిరెడ్డి దుర్గారావుల నివాస గృహాలను తనిఖీలు చేశామన్నారు. నిడదవోలు, చాగల్లు మం డలాల్లోని ఆయా గ్రామాలలోని కోళ్ళఫారంలు, రైస్‌మిల్లులను తనిఖీ చేశామన్నారు. ఎటువంటి రేషన్‌బియ్యం లభ్యం కాలేదన్నారు.రేషన్ బియ్యం కొనుగోళ్లు, అమ్మకాలు చేపడితే క్రిమినల్, పిడి యాక్టు కింద కేసులు నమోదు చేస్తామన్నారు.ఆయన వెంట కొవ్వూరు సివిల్ సప్లయిస్ డీటీ సునీత ఉన్నారు.



చాగల్లులో డీఎస్‌వో తనిఖీలు

రోడ్డు కంరైలు బ్రిడ్జికి 50 ఏళ్లు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రోడ్డు కంరైలు బ్రిడ్జి గోల్డెన్ జూబ్లీ ఉత్సవం బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు చేశారు. సబ్బెళ్ళ విజయ దుర్గారెడ్డి మాట్లాడుతూ ఆనాడు ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో నిర్మించిన రోడ్డుకంరైలు వంతెనను 1974 నవంబరు 20న అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ప్రారంభించారన్నారు. ఇప్పటికి 50 ఏళ్ళు పూర్తయిందన్నారు. 1967లో నిర్మాణం ప్రారంభించి 1974కు పూర్తిచేశారని తెలిపారు. అంతకు పూర్వం రాజమహేంద్రవరం కొవ్వూరు మధ్య పడవులు, లాంచీలు, పంట్లపై ప్రయాణించేవారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబి, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు షాజహాన్, విజయ్‌శ్రీరాం, కామేష్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వంగలపూడి -1,2 రీచ్‌ల అనుమతులు రద్దు : జేసీ

సీతానగరం,నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : వంగలపూడి 1,2 ఇసుక రీచ్‌లు రద్దుచేస్తున్నట్టు జేసీ చినరాముడు ప్రకటించారు. వంగలపూడ ఇసుక ర్యాంపు వద్ద స్థానికులకు, యాజమాన్యానికి మధ్య ధరల విషయమై గొడవ జరిగిన నేపథ్యంలో బుధవారం జేసీకి వాట్సాప్ మెసెజ్‌ల ద్వారా ఫిర్యాదులు చేశారు.ఓపెన్ రీచ్ పాయింట్ వద్ద వంగలపూడి-1 నుంచి టన్ను ఇసుక ధర రూ 67.59లు వంగలపూడి-2 వద్ద టన్ను రూ 70.19లుగా ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం రీచ్ వద్ద రూ.200లు నుంచి రూ.400ల వరకు విక్రయిస్తున్నారని వచ్చిన అభియోగాల మేరు మెసర్సు పాన్ ఇండియా ప్రాజెక్ట్ వారి అనుమతి ఉత్తర్వులను రద్దుచేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ఆర్డర్లు పొందిన లారీలకు స్టాక్ పాయింట్ వద్ద అందుబాటులో ఉన్నంత వరకు ఇసుక ఇవ్వడం జరుగుతుందని తదుపరి రీచ్ మూసివేస్తామన్నారు. ప్రజలు ,ప్రజాప్రతినిధులు వాట్సాప్ మెసేజ్‌లు చేస్తున్నారని తీరా ఆరా తీస్తుంటే చెప్పడం లేదని దీనివల్ల సరైన చర్యలు తీసుకోలేకపోతున్నామన్నారు. లారీ డ్రైవర్లకు మొబైల్ స్లిప్పులు అను శీర్షికన ఏం జరుగుతోందో అంటూ ముందుగానే ఆంధ్రజ్యోతి తెలియజేయడం జరిగింది. దీనిని బలపరుస్తూ బుధవారం స్థానికులు వంగలపూడి ఇసుక రీచ్ వద్ద గుట్టు రట్టు చేశారు.దీంతో ఇసుక రీచ్ మూతపడింది.ఆయన వెంట సబ్ కలెక్టర్ కృష్ణనాయక్, మైన్స్ టెక్నికల్ అసిస్టెంట్ శైలజ ,వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రామ్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.



వంగలపూడి రీచ్ వద్ద మాట్లాడుతున్న జేసీ చినరామడు



చేప..చేపా.. ఎక్కడమ్మా!

కనుమరుగవుతున్న మత్స్యసంపద

ఎన్ని రకాల చేపలు వచ్చేవి.. కొన్ని రకాల చేపల పేర్లు అయితే పలకడం కూడా వచ్చేది కాదు.. ఇప్పుడో ఒకటో రెండో రకాలు వస్తున్నాయ్.. ఏమైపోయిందా జలసంపద.. అలా అలా కనుమరుగైపోయిందంతే.. అటు సముద్రంలోకానీ.. ఇటు గోదావరిలో కాని కనుమరుగైన చేప జాతులు ఎన్నో ఉన్నాయి.. పూర్వం లెక్కపెట్టలేనన్ని చేప జాతులు ఉంటే.. నేడు ఒకటో రెండో రకాలు మార్కెట్లలో లభ్యమవుతున్నాయి. మత్స్య సంపదకు పెట్టింది పేరైన మన ప్రాంతంలో గోదావరి, సముద్రంలో విలువైన చేపల రకాలు తగ్గిపోతున్నాయి. సముద్రంలో పరిశ్రమల నుంచి కలిసే రసాయన వ్యర్థాలతో జలాలు కలుషితమై మత్స్యసంపద అంతరించు పోతుండడంతో వాటి వృద్ధి లక్ష్యంగా ప్రతిఏటా నవంబరు 21న మత్స్య శాఖ ద్వారా ప్రపంచ మత్స్యదినోత్సవం నిర్వహి స్తున్నారు. నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..



- అరుదైన.. జలపుష్పాలు
- కానరాని పలు రకాలు
- కొన్ని మాత్రమే లభ్యం
- గోదావరి వాసుల నిరాశ
- నాటికి.. నేటికీ ఎంతో తేడా
- ప్రభుత్వం దృష్టి పెట్టినా ఇంతే
- నేడు మత్స్య దినోత్సవం

కాకినాడ సిటీ/కొత్తపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులస పులుసు.. వంజరం ఇగురు.. సొర పొట్టు.. రొయ్యల వేపుడు.. అబ్బా.. చదువు తుంటేనే నోరూరిపోతోంది కదూ.. ఉమ్మడి జిల్లాలో గోదావరి,సముద్రం, రిజర్వాయర్లు, చెరువుల్లో ఒక నాడు విరివిగా లభ్యమయ్యే చేపలు ఇవి.. మరి నేడు ఈ జాతులే కనుమరుగైపోయాయి. ఒకటీ అరా దొరుకుతున్నాయి. కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని సము ద్రంలో మత్స్యకారులకు బోలెడు రకాల సముద్ర చేపలు లభ్యమ య్యేవి. యానాంతో పాటు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, ధవళేశ్వరంల్లో గోదావరి చేపలు విరివిగా లభ్యమయ్యేవి. మరి నేడు మత్స్య సంపద కనుమరుగైపోతోంది.

మత్స్యసంపదకు కేరాఫ్ కాకినాడ

మత్స్యసంపదకు కేరాఫ్ కాకినాడ జిల్లా నిలుస్తోంది. జిల్లాలోని ఉప్పాడ, తొండంగి, కాకినాడల్లో సముద్రంలో భారీగా చేపలవేట సాగుతోంది. ఇక్కడి మత్స్యకారులకు వివిధ రకాల చేపలు వలలకు పడుతుంటాయి. వంజరం, సందువా, కోనెం, మాగ,కొయ్యింగ, ట్యూనా రకాల చేపలు ఎక్కువగా దొరుకుతున్నాయి వీటితో పాటు రొయ్యలు, పీతలు పడుతున్నారు. అపోలో ఫిష్, ఎల్లలు, ఇంగిలాలు, టేకు, కార, కలివిందలు, కవళ్లు, సెత్తలు వంటివి పడుతున్నాయి. వీటికి డిమాండ్ భారీగా ఉంది. కాకినాడ నుంచి రోజూ వేల టన్నుల్లో చేపలు, రొయ్యలు, పీతలు ఎగు మతవుతున్నాయి.చేపలు చెన్నై, కేరళ, ముంబయి వంటి ప్రాంతాలకు ఎగుమతి జరుగుతోంది. టైగర్, రొయ్య, తెల్ల రొయ్యలు యూరోపియన్ దేశాలకు ఎగుమతవుతున్నాయి. సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా చెన్నైకు మత్స్య సంపద ఎగుమతులు జరుగుతున్నాయి. పెద్ద సైజు రొయ్యలు, పెద్ద సైజు పీతలు ఎగుమతుదారులకు లాభాలను ఆర్జించి పెడుతున్నాయి. కాకినాడలో ఐదు చోట్ల చేపల మార్కెట్లు ఉండగా అక్కడ వీటి విక్ర యాలు జరుగుతున్నాయి.కుంభాభిషేకం రేవులో ఉదయం వేళ తాజా చేపలు, రొయ్యలు, పీతలు అందు బాటులో ఉంటాయి. కాకినాడ జిల్లాలో 403 మెకనైజ్డ్ బోట్లు(పెద్ద బోట్లు), 3709 ఫైబర్ బోట్లు కలిపి మొత్తం 4,523 బోట్లు సముద్రంలో మత్స్య వేట సాగిస్తున్నాయి. వీటిపై ఆధారపడి 26,749 మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. కాకినాడ, సముద్ర మత్స్య ఉత్పత్తులతోపాటు జిల్లాలో 9వేల హెక్టార్లలో రొయ్యల చెరువులు, చేపల చెరువులు ఉన్నాయి.మత్స్యకారులకు ఫిషింగ్ బోట్ల ద్వారా సముద్రంలో మత్స్యవేటపై శిక్షణ ఇచ్చే రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ కాకినాడలో ఉంది.



కోనసీమలోను సముద్ర చేపలు

ఉప్పలగుప్తం/అల్లవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సముద్ర జలాలు,గోదావరి నదీపాయలలో చేపల వేట సాగిస్తూ మత్స్యసంపదపై ఆధారపడి వేలా ది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. సముద్రంలో వేల రకాల చేపలున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో కొన్ని రకాలు మాత్రమే లభిస్తుంటాయి. ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప, ఎస్.యానాం కేంద్రాలుగా జరిగే సముద్ర చేపల వేటలో విలువైన మాగ, సొర, నలుపు, తెలుపు చందువా, కట్టపరిగెలు, కొయ్యింగ, పండుగప్ప, టూనా, సావిడాలు, కాణాకాంతలు, పలు రకాల గొరకలు, మెత్తళ్లు, కొమ్మురపాములు, పీతలు, విలువైన రొయ్యలు లభిస్తున్నాయి. ఇక సీజనల్‌గా ఏట్లు, చీరమేను వంటి రకాలు లభ్యమవుతుంటాయి. ఒకప్పుడు పనికిరానివిగా భావించిన సముద్రం గొరకలకు ప్రస్తుతం మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉంది. కారా చేపల విలువను మాంసాహారులు గుర్తించారు. సముద్రంలో దొరికే జలుగు చేపల రుచి అబ్బా అనిపించకమానదు. గిరాకీ కారణంగా జలుగులు, పండగొప్పలను చెరువుల్లో పెంచుతున్నారు. సముద్రంలో వాటినే మాత్రమే అందరూ ఇష్టపడుతున్నారు.







పులసలకు కేంద్రం యానాం..

అరుదైన చీరమేను కూడా దొరికేది ఇక్కడే

యానాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యానాం గోదావరిలో దొరికే చేపలకు ఎంతో గిరాకీ ఉంటుంది. ముఖ్యంగా గోదావరికి ఎర్రనీరు(వరద) వచ్చిందంటే చాలు పులసుల వేట మొదలవుతుంది. తూర్పుగాలుకు, వర్షానికి చీరమేను దొరుకుతుంది.ఈ ఏడాది ఇక్కడ చీరమేను అత్యధికంగా దొరకడం విశేషం. భారీ పండుగొప్పలు, ఎర్రచంగలం, తెల్ల చెంగలం, మగా, తెల్ల చందువా, నల్ల చందువా, సీదా చందువా, కట్టా చేపలు, పితాలు, గుడ్డు పితలు, తెల్ల, సేకా, పప్పు, గుడ్డు రెయ్యలు, మెత్తళ్లు, వివిధ రకాల దొందులు, ఏట్లు, రావలు, టేకు తదితర చేపలు యానాం గోదావరిలో లభ్యమవుతాయి.

మత్స్యకారులకు సమగ్ర సమాచారం



సముద్రంలో వాతావరణ పరిస్థితులు, మత్స్య సంపద లభ్యమయ్యే ప్రదేశాలు తెలుసుకునేందుకు సాంకేతిక పరికరాలు అందుబాటులోకి తెచ్చాం. మత్స్యకారులకు సబ్సిడీపై పరికరాలు, వేట విరామ పరిహారం అందజేస్తున్నాం.

-జిల్లా మత్స్యశాఖ అధికారి కరుణాకరరావు



తగ్గిన విలువైన రకాలు

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరప్రాంతంలో ఒకప్పుడు భారీస్థాయిలో చేపలవేట జరిగేది. ప్రస్తుతం సముద్రంలో చేపలు పడడం తగ్గింది. గతంలో ఇక్కడ చాలా ఖరీదైన, రుచికరమైన చేపలు, రొయ్యలు దొరికేవి. పెద్ద జాతి చేపలకు చెందిన వంజరం, కోనాము,సంధువా, మునివా లం, మాగ, సిదుములు, పెద్ద పెద్ద పట్టి సావ డాలు, టైగర్ జాతి రొయ్యలు, సొర్రలు, పండుగప్పలు, సింహు చేపలు విరివిగా మత్స్యకారుల వలలకు దొరికేవి.క్రమేపీ తీరప్రాంతాల్లో కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు నెలకొల్పడం, డీప్ సీలో ఓడల నుంచి విడుదల చేసే వ్యర్థ రసాయనాలతో మత్స్యసం పద తగ్గిందని మత్స్యకారులే చెప్తున్నారు.

ఏటా 7 కోట్ల చేప పిల్లల ఉత్పత్తి

మత్స్య సంపద ఉత్పత్తికి కేరాఫ్ కడియం

కడియం,నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల పేరు చెబితేనే మత్స్య సంపద గుర్తుకొస్తుంది. ఫేమస్ అయిన చేపలన్నీ ఈ జిల్లాలోనే లభ్యమవుతాయి. గోదావరినది, చెరువులు, రిజర్వాయర్‌ల్లో పెరిగే మత్స్య సంపదకు మంచి గిరాకీ ఉంది.ఈ మత్స్యసంపద ఉత్పత్తికి తూర్పుగోదావరి జిల్లా కడియం కేం ద్రంగా మారింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోనసీమ, మెట్ట, కాలవ కింద ప్రాంతాలకు చేపపిల్లలను కడియం మత్స్యక్షేత్రం నుంచి పంపిస్తుంటారు. ప్రతిఏటా జూన్, జూలై, ఆగస్టు నెలల్లో ఏడు కోట్ల చేపపిల్లలను ఉత్పత్తి చేసి సరఫరా చేస్తుంటారు.జిల్లాలో ప్రధానంగా బొచ్చె, రాగండి, మ్రిగాల రకాల చేప పిల్లల ఉత్పత్తి జరుగుతోంది. జిల్లాలో 41 కిలోమీటర్ల పొడవుతో 10 వేల హెక్టార్ల నీటి విస్తీర్ణంతో గోదావరి నదిపై చేపల ఉత్పత్తుల ద్వారా 1843 మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. జూన్ నుంచి ఆగస్టు వరకు బ్రీడింగ్ ద్వారా చేపపిల్లల ఉత్పత్తి సాగుతుంది. ప్రతిఏటా కడియం మత్స్య క్షేత్రం నుంచి 25 నుంచి 30 లక్షల చేపపిల్లలు, జిల్లావ్యా ప్తంగా 50 లక్షల చేప పిల్లలు ఉత్పత్తి సాగు తోంది.ఇక్కడి నుంచి 3ఎంఎం పరిమాణం లో చేపలు(స్పాన్) తయారు చేసి ఫిషర్‌మెన్ సొసైటీలకు,అమలాపురం, ద్వారాపూడి, రాజవోలు,కొత్త పేట,రంపచోడవరం, రాజవొమ్మంగి, నిడదవోలు,సీతానగరం,బిక్కవోలు చేపల కేంద్రాలకు పంపించి అక్కడ 50 నుంచి 80 ఎంఎం పరిమాణంలో ఫింగర్ లింగ్స్ తయారు చేస్తారు. తర్వాత గోదావరిలో వదులుతారు. ఈ ఏడాది 7 కోట్ల మేర చేపపిల్లల(చేపచిరునారు) ఉత్పత్తి లక్ష్యం కాగా నూరుశాతం ఉత్పత్తి సాధించారు.





29.83 లక్షల చేపపిల్లలు వదిలాం



2023-24లో ఫింగర్‌లింగ్స్ పథకం ద్వారా మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా 50 నుంచి 80 ఎంఎం పరిమాణం ఉన్న 29.83 లక్షల చేపపిల్లలను గోదావరిలోకి వదిలాం. ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఏపీఎస్ఏడీఏ) యాక్ట్ కింద రైతులు ఆక్వాసాగు చేసుకునేలా అనుమతులు ఇస్తున్నాం.

-వి.కృష్ణారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

మన్యం స్పెషల్.. 'ఎరగడ'

చింతూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎరగడ చేపలు.ఈ తరహా చేపలు కేవలం మన్యానికే పరిమితం.వారాంతపు సంతలే వీటి విక్రయ కేంద్రాలు.ఆదివాసీ మహిళలు వారి గ్రామ సమీపాల్లో జరిగే వారాంతపు సంతల్లో అమ్ముతుంటారు. ఒక్కో పోగు రూ.50 వరకు ఉంటుంది. వాగులు, వంకలు, చెరువులు, వరి పొలాలు.. ఇవన్నీ ఎరగడ చేపలు లభ్యమయ్యే ప్రదేశాలు. వేటకు పందిరి వలలు, చిక్కాలు, చేతివలలు వినియోగిస్తుంటారు.ఆదివాసీలకు ఎరగడ చేపలు ఆదాయ వనరుల్లో ఒకటి. వరి పొలాల్లో చేపల వేటకైతే ఒకట్రెండు కుటుంబాల వరకే పరిమితమవుతారు. పెద్ద చెరువుల్లో వేటకు మాత్రం వందల సంఖ్యలో కుటుంబాలు రంగంలోకి దిగుతుంటాయి.అక్కడ దొరికిన చేపల్ని ఒక పెద్ద పోగుగా పోసి తర్వాత అక్కడ వేటకు ఎన్ని కుటుంబాలు హాజరైతే అన్ని కుటుంబాల వారూ సమానంగా పంచుకుంటారు.ఆ వేటలో వివిధ రకాల సైజు చేపలు లభ్యమవుతుంటాయి. వాటిలో చిన్న సైజు చేపల్ని ఎంపిక చేస్తారు. అనం తరం వాటిని వరి గడ్డిపై పరిచి కాల్చుతారు. ఒక మోస్తరుగా చేపలు కాలిన తర్వాత వాటిని తిరిగి ఎండలో నాలుగైదురోజులపాటు ఆరబెడ తారు. వీటినే ఎరగడ చేపలంటారు. ఈ చేపల్ని నెల నుంచి రెండు నెలల వరకు నిల్వ చేసు కునే అవకాశం ఉంది. మన్యంలో ఇష్టమైన కూరల్లో ఒకటి ఎరడగ చేపల కూర.









శునకాల నేస్తం!







- వీధి కుక్కలకు ప్రతిరోజూ అన్నదానం
- తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఇదే పని
- ఎనిమిదేళ్లుగా క్రమం తప్పకుండా చేస్తున్న దంపతులు
- కాకినాడలోని వివిధ ప్రాంతాల్లో శునకాలకు అన్నదానం
- మొత్తం సొంత ఖర్చుతోనే.. విరాళాలు స్వీకరించరు
- రోజుకో రకం కూర, అప్పుడప్పుడూ చికెన్ కూడా..
- మూగజీవాలపై ప్రేమను చాటుతున్న దంపతులు



వీధి కుక్కలకు అన్నం పెడుతున్న కంటిపూడి రాంబాబు.. (పైన) కంటిపూడి రాంబాబు, ఆయన సతీమణి సత్యవేణి

సరిగ్గా వేకువజాము 5 గంటలు.. ఒక పెద్దాయన ఇంటి నుంచి జేబులో పేపర్లు పెట్టుకుని.. ఓ వైపు బకెట్ తగిలించుకుని ద్విచక్రవాహనంపై బయలుదేరతాడు.. కొంతదూరం వచ్చి ఓ చోట ఆగుతాడు.. అప్పుడు ఆ పరిసరాల్లోని వీధి కుక్కలన్నీ ఆయన్ను చూసి వెంటనే పరుగుపరుగున అక్కడకు వచ్చేస్తాయి. ఆయన తన జేబులోని ఓ పేపర్ కింద వేసి ఆ బకెట్‌లోంచి అన్నం తీసి అందులో వేస్తాడు.. అప్పటికే ఆకలి మీద ఉండే ఆ శునకాలు వెంటనే ఆ అన్నం తినేస్తాయి. ఆయన మళ్లీ ఇంటికెళ్లి ఇంకో బకెట్‌తో బయటకు వచ్చి వేరే ప్రాంతానికి వెళ్తారు.. అలా మధ్యాహ్నం 2 గంటల వరకు ఇదే పని. రోజూ ఐదారు బకెట్లతో అన్నం శునకాలు పెడుతుంటారు.. కాకినాడ నగరం, రూరల్ ప్రాంతాల్లో ఎనిమిదేళ్లుగా ఓ పెద్దాయన శునకాలపై ప్రేమతో ఇలా చేస్తున్నారు. ఆయన భార్య కూడా ఈ మహత్కార్యంలో భాగమయ్యారు. రోజూ తెల్లవారుజామున 3 గంటలకు లేచి భోజనం తయారు చేయడమే పనిగా పెట్టుకున్నారు.

కాకినాడ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తోటివారికి, కన్నవారికీ అన్నం పెట్టని రోజులివి.. ఒకరిద్దరికి అన్నదానం చేసి పది మందికి చెప్పుకుంటున్నవారు ఎందరో ఉంటున్నారు.. కానీ వీళ్లు ఎనిమిదేళ్లుగా కొన్ని వందలాది వీధికుక్కలకు రోజూ క్రమం తప్పకుండా అన్నం పెడుతూ.. మానవత్వం చాటుకుంటున్నారు. కంటిపూడి రాంబాబు, సత్యవేణి దంపతుల స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా రంగంపేట. పిల్లల చదువుల నిమిత్తం 2000 సంవత్సరంలో కాకినాడలోని తోట సుబ్బారావు నగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. వీరికి ఒక కుమారుడు శభరీష్ ఉన్నాడు. రాంబాబు గతంలో వ్యవసాయం చేసేవారు. పిల్లలకు ఉద్యోగాలు రావడం.. ఆయనకూ వయసు పైబడడంతో కొన్నేళ్లుగా విశ్రాంతి తీసుకుంటూ ఉండేవారు. సహజంగా జంతు ప్రేమికుడైన రాంబాబుకు రోజూ బయటకి వెళ్లినప్పుడు తారసపడే వీధి కుక్కలను చూస్తుండేవారు. అవి ఆకలితో అలమటించడం చూసి చలించిపోయేవారు. ఆకలి ఎవరిదైనా ఒకటే. అడగనిదే అమ్మైనా పెట్టదు అంటారు.. కానీ మూగజీవాలు నోరు తెరిచి అడగలేవు కదా ఎలా అని ఆలోచించారు.. అదే విషయాన్ని తన భార్యకు చెప్పారు. అలా వీధికుక్కలకు రోజూ అన్నం పెట్టాలని ఆ దంపతులు నిర్ణయించుకున్నారు. అలా ఈ ప్రయాణం 2016లో ప్రారంభించారు. మూగజీవాలకు కడుపు నింపాలన్న ఈ దంపతుల ఆలోచన వారి కుమారుడు శభరీస్ తోడయ్యాడు. అతడు రిలయన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా ప్రతినెలా వీరికి రూ.15 వేలు పంపిస్తున్నాడు. ఈ డబ్బులతోపాటు వీరు రూ.5వేలు కలిపి మొత్తం రూ.20వేలతో వీధి కుక్కలకు రోజూ అన్నం పెట్టే కార్యక్రమం చేపడుతున్నారు. దీని గురించి వీరు గొప్పగా చెప్పుకోరు. ఈ అన్నదానానికి ఎవరి నుంచి సహాయం తీసుకోరు. తమ సొంత డబ్బులతోనే కుక్కలకు ఆకలి తీరుస్తున్నారు. వీళ్ల అన్నదానంతోపాటు వీధి కుక్కలకు ఎక్కడైనా గాయాలైనా సొంత ఖర్చుతోనే వైద్యం కూడా చేయిస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

కాకినాడ సిటీ, రూరల్ ప్రాంతాల్లోని బోట్ క్లబ్, వెంకట్‌నగర్, సురేష్‌నగర్, గొడారిగుంట, ఆర్టీవో కార్యాలయం రోడ్డు, నాగమల్లితోట జంక్షన్, డీమార్టు ఏరియా, మూడుగుళ్ల సెంటర్, తోట సుబ్బారావు నగర్, ప్రాంతాల్లోని రాంబాబు వీధికుక్కలకు రోజూ ఆహారం పెడుతున్నారు. దీనికోసం రాంబాబు భార్య సత్యవేణి ప్రతిరోజూ తెల్లవారుజామున 3గంటలకు నిద్ర లేస్తారు. వంట చేయడం ప్రారంభించి 5 గంటలకు ముగిస్తారు. ఒక్కోరోజు ఒక్కో మెనూ ఉండేలా చూస్తారు. పెరుగన్నం, కాయగూరలతో కూరన్నం, ఒక్కోసారి చికెన్ తయారు చేస్తుంటారు. అలా తయారుచేసిన ఆహారాన్ని ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఆయా ప్రాంతాల్లో అన్నం బకెట్‌ను బైక్‌కు తగిలించుకుని కనిపించిన ప్రతి కుక్కకు ఆహారం పెడుతుంటారు. ఇలా ప్రతి రోజూ 5నుంచి 6 బకెట్‌ల వరకూ ఆహారాన్ని కుక్కలకు పెడుతున్నారు. 8ఏళ్లుగా ఆ కుటుంబం ఈ విధంగా చేస్తోంది.

అందరూ ఆహారం అందించాలి

జంతువులన్నింటికంటే కుక్క విశ్వాసం గలది. వీధికుక్కలకు ఆహారం, తాగేందుకు నీరు ఇస్తే అవి ఎవరికీ హానిచేయవు. తమ ప్రాంతాల్లోని కుక్కలకు సమాజంలోని ప్రతిఒక్కరూ ఆహారం, తాగు నీరు అందించాలి. మూగజీవాలపట్ల జాలి, దయ చూపాలి. నాకు ఓపిక ఉన్నంతకాలం వీధి కుక్కలకు అన్నం పెట్టడం కొనసాగిస్తాను. ఏదొక మంచి పనిచేయాలనే ఉద్దేశంతో నేను, నా భార్య, కుమారుడు కలిసి కుక్కలకు అన్నం పెడుతున్నాం.

- కంటిపూడి రాంబాబు, జంతు ప్రేమికుడు

ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీకి
ఒక నామినేషన్ ఉపసంహరణ

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి దాఖలు చేసిన నామినేషన్లలో బుధవారం ఒక నామినేషన్‌ను ఉపసంహరణ జరిగినట్లు సహాయ రిటర్నింగ్ అధికారి వెంకట్రావు తెలిపారు. అహ్మద్ షేక్ అనే అభ్యర్థి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రస్తుతం ఎన్నికల బరిలో ఐదుగురు అభ్యర్థులు మాత్రమే ఉన్నారు. 21వతేదీ వరకు ఉపసంహరణలకు సమయం ఉండడంతో బరిలో ఎవరు నిలుస్తారో అనేది గురువారం సాయంత్రానికి తేలనుంది.


ఇందుకూరు-1 గ్రామంలో చలి మంట కాగుతున్న ప్రజలు

మన్యంలో చలి పులి

దేవీపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నవంబరు నెలాఖరు రావడంతో మన్యంలో చలి తీవ్రత పెరుగుతోంది. ఏజెన్సీలో గ్రామాలన్నీ సాయంత్రం ఐదు గంటలకే చీకటిగా మారుతున్నాయి. పొగ మంచు కమ్మేయడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావట్లేదు. తీవ్రమైన చలి నుంచి బయటపడ్డానికి మంట వేసుకుని కాగుతున్నారు. మున్ముందు చలి మరింత పెరుగుతుందని స్థానికులు చెప్తున్నారు.



తల్లి ప్రేమకు సాటి లేదు...

సామర్లకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట జయలక్ష్మి థియేటర్ సమీపాన ప్రకాష్‌నగర్ నీలిమా శ్రీను ఇంటి ఎదురుగా ఒక వీధి కుక్క పిల్లను మోటారు సైకిలు ఢీకొనడంతో తలపగిలి మృతి చెందింది. దీంతో అప్పటిదాకా తన వద్దే పాలు తాగుతున్న తల్లి కుక్క తల్లడిల్లింది. అప్పటికే ఐదు పిల్లలు పాలు తాగాయి. పిల్ల కుక్క మృతి చెందిందన్న విషయం తెలియక దానిని సాకుతూ నువ్వూ పాలు తాగు అని లేపుతున్నట్టుగా కనిపించిన దృశ్యం ఆ దారిన వెళ్లే పలువురిని విస్మయపరిచింది.



కార్తీకంలోనూ అ'ధర'హో



శీతాకాలం నేపథ్యంలో

గుడ్డు ధరకు రెక్కలు

పౌల్ట్రీ నిర్వాహకులకు ఊరట

టోకుగా రూ.5.65

చిల్లరగా రూ.7కి విక్రయం

మండపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో కూడా గుడ్డు ధర పరుగులు పెడుతోంది. పెరుగుతున్న ధర కోళ్ల ఫారాల నిర్వాహకులకు లాభాలు తెచ్చిపెడుతుంటే సామాన్యుడికి మింగుడుపడట్లేదు. రెండేళ్ల పాటు ఒడిదుడుకులు ఎదుర్కొన్న కోళ్ల పరిశ్రమ ప్రస్తుతం ఊపిరి పోసుకుంటోంది. గతంలో నష్టాల కారణంగా చాలా మంది రైతులు పిల్లలు బ్యాచ్‌లను వేయలేదు. దానివల్ల గుడ్డు డిమాండ్‌కు సరిపడా సరుకు లేకపోవడం ధరల పెరుగుదలకు కారణమని పౌల్ట్రీల నిర్వాహకులు చెప్తున్నారు. గుడ్డు తయారీకి రూ.4.80 అవుతుంది. ధర ఐదు రూపాయలు దాటి ఉంటేనే గిట్టుబాటు ఉంటుందని పౌల్ట్రీ రైతులు అంటున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 300 వరకు కోళ్ల ఫారాలు వున్నాయి. వీటిలో సుమారు 1.40 కోట్ల కోళ్లను పెంచుతున్నారు. రోజుకు 1.10 కోట్ల గుడ్లు ఉత్పత్తి జరుగుతోంది. స్థానిక అవసరాలకు 40శాతం గుడ్లు వినియోగిస్తుండగా 60శాతం గుడ్లు పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, బిహార్, బెంగాల్‌లకు ఎగుమతి అవుతాయి. కోళ్ల పరిశ్రమ కొన్నేళ్లుగా నష్టాల్లో కూరుకుపోగా తాజాగా పెరిగిన గుడ్డు ధర కాస్త ఊరటనిస్తోందని పౌల్ట్రీ నిర్వాహకుడు తాడి శేషారెడ్డి తెలిపారు. ప్రస్తుతం గుడ్డు ధర రూ.5.65కి చేరింది. బయట మార్కెట్లో చిల్లరగా రూ.6.50 నుంచి రూ.7 దాకా విక్రయిస్తున్నారు.




శిఖర ప్రతిష్ఠ చేస్తున్న అర్చకస్వాములు, తిలకిస్తున్న భక్తులు

ఘనంగా భావనారాయణస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ

సర్పవరం జంక్షన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుప్రసిద్ధ పురాతన క్షేత్రం సర్పవరం శ్రీరాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ప్రధాన ఆలయ గోపురంపై శిఖర ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్ద పుల్ల శ్రీరాములు, ఆలయ మాజీ చైర్మన్ పుల్ల శ్రీను, దాతల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి మూలవరులకు స్నపన తిరుమంజనం, కళా వాహన, గోదర్శనం, అష్టోత్తర శత ఘటాభిషేకం, శాంతికర కల్యాణం, పంచామృతాభిషేకం, పలు రకాల విశేష ద్రవ్యాలతో హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో స్వామివారి ప్రధాన ఆలయ గోపురంపై శిఖర కలశ, సుదర్శన చక్రం ప్రతిష్ఠ వేలాది మంది భక్తుల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన బూరెలను శిఖరంపై ఉంచి పూజలు చేశారు. వాటిని స్వామివారికి నివేదించిన తర్వాత భక్తులకు పంపిణీ చేశారు. మహిళలు చీర కొంగుల్లో బూరెలను ఒడిసిపట్టుకుని ప్రసాదం స్వీకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉప కమిషనరు కార్యాలయ సూపరింటెండెంట్ సోమరాజు, కూటమి నాయకులు పుల్ల శ్రీరాములు, ముద్దన ప్రకాశ్, పుల్ల వీరబాబు, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, మానేపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.


భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

గండిపోశమ్మ దర్శనం పునః ప్రారంభం

దేవీపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండిపోశమ్మ అమ్మవారి దర్శనాలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. జూలైలో వచ్చిన వరదలకు గోదావరి ఉప్పొంగి గండిపోశమ్మ ఆలయం ముంపునకు గురైంది. దీంతో అమ్మవారి దర్శనాలకు భక్తులు దూరమయ్యారు. వరద దగ్గి అమ్మవారి ఆలయం బయటపడడంతో అధికారులు ఆలయాన్ని శుభ్రపరిచి సంప్రోక్షణ చేశారు. అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో మహిళా భక్తులు 108 బిందెలతో గోదావరి జలాలు తీసుకొచ్చి అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. గండిపోశమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవచ్చని, అన్ని ఏర్పాట్లు చేశామని దేవస్థానం ఈవో లక్ష్మీకుమార్ తెలిపారు. పూజల అనంతరం అన్నదానం చేశారు. ఆదివారం భక్తుల సంఖ్య అధికం కానున్న దృష్ట్యా మరిన్ని ఏర్పాట్లు చేయాలని పలువురు కోరారు.

రాజమహేంద్రవరంలో జీఆర్‌టీ జ్యువెలర్స్ ప్రారంభం



రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మేలిమి బంగారు ఆభరణాల అమ్మకంలో పేరెన్నిక గన్న జీఆర్‌టీ జ్యువెలర్స్ తన 61వ షోరూమ్‌ను తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులోని శ్యామల థియేటర్ వద్ద బుధవారం ప్రారంభించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అనంత పద్మనాభన్ మాట్లాడుతూ చారిత్రక నగరంలో తమ షోరూమ్‌ను ప్రారంభించినందుకు ఎంతో సంతోషిస్తున్నామన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా తమ కస్టమర్లకు ప్రత్యేకమైన ప్రయోజనాలు, ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నామన్నారు. బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.50, బంగారు ఆభరణాల వేస్టేజిపై 20 పర్సెంట్ (వీఏ), డైమండ్ విలువపై క్యారెట్‌కు రూ.10వేలు తగ్గింపు ఇస్తున్నామన్నారు. వెండి వస్తువులు, పట్టీల మేకింగ్ చార్జీలపై 25 శాతం, అన్‌కట్ డైమండ్ విలువపై 10 శాతం తగ్గింపు పొందవచ్చన్నారు. 1964లో ప్రారంభమైన నాటి నుంచి జీఆర్‌టీ జ్యువెలర్స్ నాణ్యత పట్ల నిబద్ధత కలిగి, ప్రాంతీయ కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన బంగారం, డైమండ్, ప్లాటినం, వెండి జాతి రత్నాల ఆభరణాల విభిన్న ఎంపికను అందజేస్తోందన్నారు. ప్రత్యేక, శాశ్వతమైన డిజైన్లను నైపుణ్యం కలిగిన కళాకారులతో కచ్చితత్వంతో రూపొందిస్తామన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ నిజమైన హస్తకళను ప్రతిబింబించే టైంలెస్ ఆభరణాలను రూపొందించడం తమకెంతో గర్వంగా ఉందన్నారు. గొప్ప వారసత్వానికి, ప్రఖ్యాతిగాంచిన రాజమహేంద్రవరం వాసులకు నాణ్యత గల ఆభరణాలను అందించడమే తమ లక్ష్యమని చెప్పారు.


నిడదవోలు పోలీసులు రికవరీ చేసిన నగదు, బంగారం

గుమస్తాయే అసలు నిందితుడు


బంగారం, నగదు చోరీ కేసును ఛేదించిన నిడదవోలు పోలీసులు

నిడదవోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బంగారం, నగదు చోరీ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు సీఐ తిలక్ బుధవారం వెల్లడించిన వివరాలు ఇలా వున్నాయి... ఈనెల 14వ తేదీన తాడేపల్లిగూడెం నుంచి రాజమహేంద్రవరం బంగారు నగల దుకాణానికి తీసుకు వెళ్లేందుకు తన గుమస్తా అయిన అమర్‌కు షాపు యజమాని 289.340 గ్రాముల బంగారం ముక్కలను, రూ.6.30 లక్షల నగదు ఇచ్చారు. నిడదవోలు వచ్చేసరికి శెట్టిపేట ఇరిగేషన్ కార్యాలయం పొదల్లో డబ్బు, బంగారం దాచి తనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి వాటిని దోచుకుపోయారని అతడు యజమానికి చెప్పాడు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు నిడదవోలు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అమర్ దురుద్దేశంతో పథకం ప్రకారం బంగారం నగదు దాచి దొంగతనం డ్రామాకు తెరలేపాడని తెలిసింది. అమర్‌ను విచారించగా అసలు విషయం బయటపడింది. దీంతో బుధవారం అమర్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు 23.64 లక్షలు ఉంటుంది. సమావేశంలో పట్టణ ఎస్‌ఐ శోభన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో చిరుద్యోగికి కుచ్చుటోపీ

మనీ లాండరింగ్‌కు పాల్పడ్డావంటూ వాట్సాప్ వీడియోకాల్‌లో బెదిరింపు

రూ.25వేలు స్వాహా చేసిన సైబర్ మోసగాడు



కరపకు చెందిన ఒక వ్యక్తికి బుధవారం పోలీస్ గెటప్‌లో ఉన్న వ్యక్తి వాట్సాప్ వీడియో కాల్ చేస్తున్న దృశ్యం

కరప, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసగాడు ఒక చిరుద్యోగి నుంచి రూ.25వేలు స్వాహా చేశాడు. కాకినాడ జిల్లా కరప గ్రామానికి చెందిన పెనుబోతుల రాజుకుమార్ గురజనాపల్లిలోని ఒక ప్రైవేట్ కంపెనీలో చిరుద్యోగం చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం అతడు డ్యూటీలో ఉండగా ఒక అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి మీ ఆధార్ కార్డుపై ఎవరో సిమ్‌కార్డు తీసుకుని ఇల్లీగల్ యాక్టివిటీస్ (చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు) చేస్తున్నారని భయపెట్టాడు. అనంతరం మరో వ్యక్తి రాజుకుమార్ ఫోన్‌కు వాట్సాప్ వీడియో కాల్ చేసి ముంబయి పోలీసునని పరిచయం చేసుకున్నాడు. కాల్ చేసిన వ్యక్తి పోలీస్ యూనిఫామ్‌లోను, అతని వెనుక సెటప్ అంతా పోలీస్‌స్టేషన్‌ను పోలి ఉండేసరికి రాజుకుమార్ కంగారుపడ్డాడు. తన పేరు, ఆధార్ కార్డు నెంబరు కరెక్ట్‌గా చెప్పేసరికి నమ్మి సైబర్ కేటుగాడికి పూర్తిగా సహకరించాడు. మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేశామని, ఎవరూ లేని గదిలోకి వెళ్లాలని బెదిరించాడు. రాజుకుమార్ వద్ద మరో మొబైల్ ఫోన్ ఉందని తెలుసుకుని దాన్ని స్విచ్ఛాఫ్ చేయాలని ఆదేశించాడు. ఎనీ డెస్క్ యాప్ సాయంతో రాజుకుమార్ మొబైల్‌ను సైబర్ మోసగాడు స్వయంగా ఆపరేట్ చేస్తూ పలు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశాడు. మనీ లాండరింగ్‌కు పాల్పడ్డావని, రూ.2.59 కోట్ల మేర లావాదేవీలు జరిపావని బెదిరించాడు. దీనిపై కేసు నమోదు చేశామని, అందుకనే డిజిటల్ అరెస్ట్ చేశామని చెపుతూ ఎఫ్ఐఆర్ కాపీతో పాటు మరికొన్ని పత్రాలను రాజుకుమార్‌కు వాట్సాప్ చేశాడు. కోర్టు ఫీజుల కింద వెంటనే రూ.25వేలు పంపించాలని హుకుం జారీ చేశాడు. సైబర్ కేటుగాడి మాటలకు హడలిపోయిన రాజుకుమార్ అతను చెప్పినట్టుగా తక్షణం రూ.25వేలను యూపీఐ పేమెంట్ చేశాడు. కొద్దిసేపటి తర్వాత మరో రూ.25వేలు పంపించాలని కేటుగాడు డిమాండ్ చేయడంతో ఇక తన వద్ద డబ్బులేదని కరప పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సరెండర్ అయిపోతానని రాజుకుమార్ చెప్పాడు. అయితే అంతవరకు లైన్‌లోనే ఉంటానని, అక్కడకు వెళ్లి పోలీసులకు ఫోన్ ఇవ్వాలని ఆదేశించాడు. ఫోన్ మాట్లాడుతూనే బండిపై నడకుదురు వద్దకు వచ్చేసరికి సైబర్ మోసగాడు ఫోన్ కట్‌చేసి రాజుకుమార్ వాట్సాప్‌కు అప్పటివరకు పంపిన పత్రాలు, ఇతర డేటాను పూర్తిగా డిలీట్ చేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన రాజుకుమార్ కరప పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని ఎస్‌ఐ తోట సునీతకు తెలిపాడు. సైబర్ మోసగాడు ఇంగ్లీష్‌లో సంభాషిస్తూ రెండు గంటల పాటు తనను ఇబ్బందులకు గురి చేశాడని, మనీ లాండరింగ్‌కు పాల్పడ్డానని, ఇల్లీగల్ యాక్టివిటీస్ చేస్తున్నానంటూ బెదిరించి రూ.25వేలు కాజేశాడని బాధితుడు వాపోయాడు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయమని, 1930కు కాల్ చేసి సైబర్ కేసు నమోదు చేయాలని పోలీసులు బాధితుడికి తెలిపారు. ప్రజలు సైబర్ మోసాగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తపడాలని ఎస్‌ఐ తోట సునీత సూచించారు. సైబర్ మోసాలపై గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టనున్నట్టు ఆమె చెప్పారు.

కాగా వారం క్రితం ఒక విలేకరికి ఒక సైబర్ మోసగాడు వీడియో కాల్ చేసి పారిస్‌లో ఉన్న తన కుమార్తెను అరెస్టు చేశామంటూ ఇలాగే బెదిరించాడు. ఒక అమ్మాయి ఏడుపు వినిపించి డబ్బులు గుంజే ప్రయత్నం చేశాడు. అయితే అదే సమయంలో ఇంట్లోనే ఉన్న సదరు విలేకరి పెద్ద కుమార్తెతో పారిస్‌లో ఉన్న తన చిన్నకుమార్తె ఫోన్‌లో మాట్లాడుతుండడంతో ఫేక్ కాల్‌గా గుర్తించి ఫోన్ కట్ చేశాడు. మరలా బుధవారం మరో సైబర్ కేటుగాడు అదే విలేకరికి వీడియో కాల్ చేయగా అతను ఫోన్ కట్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


తేజశ్రీని అభినందిస్తున్న జనసేన నేత శ్రీనివాసరావు

టేబుల్ టెన్నిస్ అంతర్జాతీయ అంపైర్‌గా తేజశ్రీ

గొల్లప్రోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టేబుల్ టెన్నిస్ అంతర్జాతీయ అంపైర్‌గా భీమన తేజశ్రీ ఎంపికయ్యారు. ఈమె జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్న భీమన రమణమూర్తి సతీమణి. ఐస్ కర్లింగ్ క్రీడలో స్వీడన్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో తేజశ్రీ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో తేజశ్రీని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అభినందించారు. ఆమె మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో రాణించి పిఠాపురం నియోజకవర్గానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు మురాలశెట్టి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

పెద్దాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలోని జవహర్ నవోదయలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 9, 11 తరగతుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును ఈ నెల 26వ తేదీ వరకు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య తెలిపారు. దరఖాస్తుల్లో తప్పులను 27, 28 తేదీల్లో సరిచేసుకోవచ్చని చెప్పారు.

యువతికి మెసేజ్‌లు పెడుతున్నాడని...

ఓ విద్యార్థిపై ముగ్గురు మైనర్ల దాడి


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

దాడి చేస్తూ వీడియో చిత్రీకరణ

సోషల్ మీడియాలో వైరల్ కావడంతో

రంగంలోకి దిగిన పోలీసులు

మలికిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాను ప్రేమిస్తున్న యువతికి మెసేజ్‌లు పెడుతున్నాడనే నెపంతో ఓ విద్యార్థిని ముగ్గురు మైనర్లు చావుదెబ్బలు కొట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా మలికిపురంలో ఈ నెల 5న జరిగిన ఈ దాడికి సంబంధించిన వివరాలను బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వై.గోవిందరావు వెల్లడించారు. చదువు మానేసిన ముగ్గురు మైనర్లు ఈ నెల 5న మలికిపురం ఏఎఫ్‌డీటీ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఒక విద్యార్థిని మోటారు సైకిల్‌పై తీసుకువెళ్లి సత్యజ్యోతి థియేటర్ వెనుక చితకబాదారు. అమ్మాయికి ఎందుకు మెసేజ్‌లు పెడుతున్నావంటూ ఒకరి తర్వాత ఒకరు దాడి చేశారు. దీంతో విద్యార్థి చావు అంచుల వరకు వెళ్లాడు. దాడి అనంతరం మలికిపురం వేంకటేశ్వరస్వామి గుడి వద్దకు తీసుకువచ్చి వదిలారు. దెబ్బలు తిన్న విద్యార్థి తీవ్ర గాయాలపాలైనా తల్లిదండ్రులకు మాత్రం విషయం చెప్పలేదు. ఈ ఘటనను వీడియో షూట్ చేయించి ఎడిట్ చేయించగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై మలికిపురం పోలీసులు తక్షణం స్పందించారు. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. వీడియోలో ఉన్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేసులు నమోదు చేసి జువైనల్ హోమ్‌కు పంపుతామన్నారు. విలేకరుల సమావేశంలో రాజోలు సీఐ టీవీనరేష్‌కుమార్, ఎస్‌ఐ పి.సురేష్ పాల్గొన్నారు.

చాగల్లు హైస్కూల్ హెచ్‌ఎం సస్పెన్షన్

చాగల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చాగల్లు జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు కాకినాడ ఆర్జేడీ జి.నాగమణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారని తూర్పు గోదావరి జిల్లా డీఈవో వాసుదేవరావు తెలిపారు. వీర్రాజు విధుల్లో అలసత్వం వహించడంతో పాటు అనర్హులకు టీసీలు విక్రయించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సస్పెన్షన్ సమయంలో జిల్లా దాటి వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల దారి మళ్లింపు

సామర్లకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మీదుగా విజయవాడ, విశాఖ వైపు రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించినట్టు విజయవాడ రైల్వే పీఆర్వో జారీ చేసిన ఉత్తర్వులు సామర్లకోట రైల్వే అధికారులకు బుధవారం రాత్రి అందాయి. విజయవాడ సమీపాన ట్రాక్‌ల్లో రైల్వే ట్రాఫిక్ నిర్వహణ పనులు జరుగుతున్న సందర్భంగా ఈ మార్పులు చేశారు.

ధనబాద్-అలపుజ (13351) బొకారో ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20, 21, 22, 23, 25, 26, 27, 28, 29, 30 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. హటియా-ఎర్నాకులం (22837) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25న నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. హటియా-ఎస్ఎమ్వీ బెంగళూరు (18637) వారాంతపు ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23, 30 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. టాటానగర్-ఎస్ఎమ్వీ బెంగళూరు (12889) వారాంతపు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22, 29 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. హటియా-ఎస్ఎమ్వీ బెంగళూరు (12835) వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26న నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. జాసిడి-తాంబరం (12376) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20, 27 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది.

ఏటీఎం కార్డుతో డబ్బులు రావట్లేదంటే మాయచేసి లక్షా 22వేలు కొట్టేసాడు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆవ రోడ్డుకు చెందిన సుబ్బలక్ష్మి ఈ నెల 10న తాడితోట పెట్రోలు బంకు సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులు తీసుకోవడానికి వెళ్లింది. కార్డు పెట్టినా డబ్బులు రాలేదు. దీంతో ఏదో సమస్య వుందని అక్కడ వున్న ఒక అపరిచిత వ్యక్తికి చెప్పింది. అతడు తాను ట్రై చేస్తానని చెప్పి కార్డు తీసుకుని మిషన్‌లో పెట్టి డబ్బులు రావట్లేదని చెప్పాడు. దీంతో సదరు మహిళ కార్డు తీసుకుని ఇంటికి వెళ్లిపోయింది. కట్ చేస్తే... ఆమె ఖాతా నుంచి దఫాదఫాలుగా రూ.1.22 లక్షలు లాగేసాడు. ఫోనుకు వచ్చిన మెసేజ్‌లను కూడా ఆమె చూసుకోలేదు. రెండు రోజుల క్రితం మెసేజ్‌లు చూసుకున్న సుబ్బలక్ష్మి కంగుతింది. బ్యాంకు వారిని కలిసి తాను మోసపోయానని తెలుసుకుని ప్రకాష్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు

గోకవరం, నవంబరు20(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని గోకవరం ఎస్‌ఐ పవన్‌కుమార్ బుధవారం తెలిపారు. గోకవరంలో బహిరంగ ప్రదేశాలలో మంగళవారంరాత్రి మద్యం సేవిస్తున్న 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. అనుమతులు లేకుండా పాన్‌షాపుల్లో, ఇతర ప్రాంతాలలో మద్యం సేవించినా ఉపేక్షించేది లేదన్నారు.

విద్యా కార్పొరేటీకరణను వ్యతిరేకిద్దాం

● ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి


సభలో మాట్లాడుతున్న శివారెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):దేశంలో విద్యావ్యవస్థ విచ్ఛిన్నమవుతున్నదని, దాన్నికాపాడుకోవాల్సిన ఆవశ్యకత గురుతర బాధ్యత విద్యార్థులపై ఉందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా 36వ మహాసభ జరిగింది. ఈ సభలో శివారెడ్డి మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. సెక్యులర్ స్వేచ్ఛ, సమానత్వం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. దేశ స్వతంత్ర్యోద్యమంలో పోరాటం చేసిన ఏకైక విద్యార్థి సంఘం తమదేనని అన్నారు. విద్యార్థులకు రాజకీయాలు తెలియడం ద్వారానే వ్యవస్థ ప్రక్షాళన జరుగుతుందని పేర్కొన్నారు. డ్రగ్స్ మత్తు పదార్థాలు అనే అంశంపై రాజమహేంద్రి విద్యాసంస్థల ఛైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సామ్రాజ్యవాద విష సంస్కృతిపట్ల యువత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ విద్యారంగ సమస్యలప ఈనెల 27, 28, 29, 30 తేదీల్లో విజయనగరంలో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణకు శ్రీకారం చుడతామని పేర్కొన్నారు.

వ్యాక్సిన్లు వేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి

● శిక్షణ కార్యక్రమంలో డీఎం హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు చిన్నారులు, గర్భిణులకు వ్యాక్సిన్లు వేసే విషయంలో ఆరోగ్యసిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం ఇన్నీసుపేట యూహెచ్‌సీ మీటింగ్ హాలులో రాజమహేంద్రవరం డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, పట్టణ ఆరోగ్యకేంద్రాలకు సంబంధించిన వైద్యాధికారులు, సూపర్‌వైజర్లకు సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.భవాని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గర్భిణీలు, చిన్నారులకు వ్యాక్సిన్లు వేసే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏడాదిలోపు పిల్లలకు 11 రకాలైన వ్యాక్సిన్లను వ్యాధులు రాకుండా ఇస్తామన్నారు.వ్యాక్సిన్ వివరాలన్నీ అదేరోజు యూడబ్ల్యుఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ రాజకుమారి, రాజమహేంద్రవరం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీహరి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ షమ్మీకుమార్, డాక్టర్ హరిచంద్రప్రసాద్, డాక్టర్ మౌనిక, డాక్టర్ నిషాంత్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుల తీరుమారే వరకూ

వదిలేది లేదు

● సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్


అసెంబ్లీలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించే విషయంలో రాజమహేంద్రవరం బోధనాసుపత్రి (జీజీహెచ్) వైద్యాధికారుల తీరుమారే వరకూ వదిలేది లేదని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. జీజీహెచ్‌లో వైద్యసేవల విషయంలో వైద్యాధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే శ్రీనివాస్ అసెంబ్లీలో చర్చించిన నేపథ్యంలో ఆసుపత్రి వైద్యాధికారులు మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యసేవలు అందుతున్న తీరుపై సూపరింటెండెంట్ వైద్యులతో సమీక్ష చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ గత ఐదేళ్లుగా రోగులకు వైద్యసేవల విషయంలో నిర్లక్ష్యంగా ఉన్న ఆసుపత్రి వైద్యాధికారుల్లో వెంటనే మార్పు రావాలని కోరుతున్నామని అన్నారు. లేదంటే ప్రజల కోసం ప్రతి 15 రోజులకు ఒకసారి పరిస్థితిని సమీక్షిస్తామని అన్నారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వాసుపత్రి సిబ్బంది తీరు మారాలి

రాజమహేంద్రవరంసిటీ: రాజమహేంద్రవరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సిబ్బంది తీరుమారే వరకు వదిలిపెట్టేదిలేదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టంచేశారు. ఈ మేరకు బుధవార ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఐదేళ్లుగా రోగులకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యంగా ఉన్న ఆసుపత్రి సిబ్బంది గురించి అసెంబ్లీ సమావేశాలలో చర్చించాక ఆసుపత్రి ఉద్యోగుల్లో కదలిక వచ్చిందన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

● జిల్లా సహకార అధికారి శ్రీరాములు నాయుడు


మాట్లాడుతున్న డీసీవో శ్రీరాములు నాయుడు

రాజమహేంద్రవరంరూరల్ నవంబరు20 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను బలో పేతం చేయడమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్య ఉద్దేశమని దీనికి అనుగుణంగా తీర్చిది ద్దాల్సిన బాశ్వత సంఘ కార్యదర్శులపై ఉందని జిల్లా సహకార అధికారి ఆర్.శ్రీరాములు నాయుడు అన్నారు. రూరల్ మండలం తొర్రేడు ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో నిర్వహించిన 71వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా సహకార జండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అందరూ కలిస్తేనే సహకార వ్యవస్థ అని వివిధ వర్గాల వారి కోసం సహకార సంఘాలను ఏర్పాటు చేసుకుంటామన్నారు. సహకార సంఘాల ప్రాముఖ్యతపై రామదాస్ కోఆపరేటివ్ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్ వివరించారు. ఈ సందర్భంగా మునారా ఆగ్రో టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ యం.వెంకటేశ్వర్లు, సంఘం సీఈవో కెవీవీ సత్యన్నారాయణ, పర్సన్ ఇన్‌చార్జి కె ఉమాపార్వతి, సీనియర్ సభ్యులు తోటా వెంకట్రామయ్య, జి.సుధాకర్‌వర్మ, కె జగన్నాధరెడ్డి, బ్యాంకు నోడల్ అధికారి ఎస్.ఉమా రాణి, బ్రాంచ్ మేనేజరు ఎస్.గౌసియా సుల్తానా బేగం, సూపర్‌వైజర్ ఎస్.లోకేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

పేదలందరికీ ఇళ్లు పంపిణీలో అవకతవకలు

● అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే బత్తుల



రాజానగరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇళ్ల పథకంలో అర్హులకు అన్యాయం జరిగిందని, దీనిని సరిచేయాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ కోరారు. బుధవారం అసెంబ్లీ వేదికగా బల రామకృష్ణ తన వాణిని వినిపించారు. నియోజకవర్గ కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించిన ప్రభుత్వ భూములను కూడా సంబంధిత శాఖకు ఏవిధమైన సమాచారం లేకుండా గత ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని, సదరు పట్టాలతో న్యాయపరమైన చిక్కులు, కోర్టు తగాదాలు వస్తున్నాయన్నారు. రాజానగరంలో ఎలక్ట్రిసిటీ, రోడ్లు మంజూరు చేయకుండా పట్టాలు ఇచ్చేశారు. దీంతో లబ్ధిదారులంతా కోర్టు తగాదాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి సరైన న్యాయం చేయాలని కోరుతున్నానన్నారు. ఈ పట్టాలన్నీ కూడా చాలావరకు దళారులు దగ్గర పెట్టుకుని, డబ్బులకు అమ్ముకోవడం, వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. పట్టాలు మంజూరులో చాలా అవకతవకలు చోటు చేసుకున్నాయని, సొంత ఆస్తుల మాదిరిగా అప్పటి సీఎం, ఎమ్మె ల్యే ఫొటోలు వేసుకుని ఒక వైసీపీ కరపత్రంలా తయారు చేశారన్నారు. పట్టాలు మార్పుచేసి కూటమి ప్రభుత్వం ఏమైనా చేస్తుందా లేదా అని ప్రశ్నించారు. రాజానగరం లో ఇంకా 10వేల మంది వరకు అర్హులైన టీడీ పీ, జనసేన అభిమానులు, సాను భూతిపరులు ఉన్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వకుండా వైసీపీ అనుకూలంగా పనిచేసిన వారికే పట్టాలు పంపిణీ చేశారన్నారు. హౌసింగ్ లోన్స్ కోసం గత ఐదేళ్లుగా లబ్ధిదారులు ఎదురుచూ స్తున్నా రని, గత ప్రభుత్వం ఒక్క లోన్ కూడా ఇవ్వ లేదు. బకాయిలు విడుదల చేయాలని కోరారు.

ఆన్‌లైన్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

రాజమహేంద్రవరంసిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని త్రీటౌన్ సీఐ అప్పారావు అన్నారు. బుధవారం సాయంత్రం త్రీటౌన్ సీఐ ఆధ్వర్యంలో స్టేషన్‌లో వివిధ బ్యాంక్‌ల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, బ్యాంక్ అకౌంట్ హోల్డర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబరు 1930కి సంబంధించి వారికి వివరించారు. అనధికార యాక్సెస్, హ్యాకింగ్, ఫోనోగ్రఫీ, సైబర్ స్టాకింగ్, పిషింగ్, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్, కేవైసీ మోసాలు, కొరియర్ స్కామ్, ఇ-కామ్స్, పెట్టుబడుల మోసాలు ఆన్ లైన్ జాబ్ పేరుతో మోసాలు, ఓఎల్ఎక్స్ ద్వారా మో సాలు, ఏపీకే మోసాలు, టాస్క్ ఆధారిత మోసాలు , క్రెడిట్ కార్డు మోసాలపై కూలంకుశంగా వివరించారు. సమావేశంలో సుమారు 50 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి

సీతానగరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సీతానగరంలో చోటుచేసుకుంది సీతానగరం గ్రామానికి చెందిన చిరువూరి వెంకటేశ్వరరావు(బాబులు) 60 బుధవారం ఉదయం కార్తీక సమారాధన కోసం వంగలపూడి మామిడితోటకు వెళ్లగా అక్కడ తేనెపట్టు చెదిరిపోవడంతో ఒక్కసారిగా తేనెటీగలు దాడిచేశాయి. దీంతో పలువురు పారియారు. బాబులు పరిగెత్తలేకపోవడంతో తేనెటీగలు చుట్టుముట్టాయి. ఈ సంఘటనతో భయాందోళనకు గురైన బాబులుకు హార్ట్‌స్ట్రోక్ రావడంతో అపస్మారక స్థితికి చేరుకోగా హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ మృతి చెందినట్లు కుటు ంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. తేనిటీగల దాడిలో పలువురు గాయపడ్డారు

నేడు అనపర్తికి రానున్న త్రినాథ్ గురుభవాని

అనపర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మి కవేత్త మాదవపట్నం త్రిశక్తి పీఠాధిపతి త్రినాథ్ గురు భవాని గురువారం అనపర్తికి రానున్నారు. అనపర్తిలోని సాయిరామ్ మందిర్‌లో గురువారంరాత్రి జరిగే ఓం శక్తి సత్సంగం ద్వితీయ వార్షికోత్సవంలో ఆయన పాల్గొంటారని ఆలయకమిటీ ప్రతినిధి చింతా ప్రకాశరెడ్డి, సత్స ంగం నిర్వాహకురాలు కర్రి శేషారత్నం తెలిపారు. వార్షి కోత్సవం సందర్భంగా గురుభవాని భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేయనున్నారని వారు తెలిపారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

డిమాండ్లు పరిష్కరించాలని ఎంపీటీసీకి వినతి

రంగంపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మే రకు రంగంపేట మండలం వెంకటాపురం గ్రామం ఎం పీటీసీ నురుకుర్తి సత్తిబాబుకు 104 సిబ్బంది, వినతిపత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగులు మాట్లాడుతూ తమకి సకాలంలో జీతాలు చె ల్లించాలని, 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ద్వారా కేవలం 50వేల రూపాయల ఖర్చుతో నిర్వహించాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూ లు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్స్‌కు స్లాబ్ అమలు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. సింగంపల్లిలో గ్రామ సర్పంచ్ తుట్టా శివశంఖర్ ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. రంగంపేట 104 సిబ్బంది గొర్రెల కాంతారావు, లంక హరి, బత్తిన అనిల్‌కుమార్, గొళ్ళవిల్లి మోహన్ పాల్గొన్నారు.

నర్సాపురంలో ద్వాదశ జ్యోతిర్లింగార్చన

కోరుకొండ, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసం పంచమి బుధవారం సందర్భంగా కోరుకొండ మండలం నర్సాపురం గ్రామంలో గణపతిహోమం, రుద్రహోమం, చండీహోమం, లక్ష్మీగణపతి హోమం, తదితర హోమాలు నిర్వహించారు. అనంతరం భారతదేవంలోని 12 జ్యోతిర్లింగాల నమూనా పార్థివ లింగాలకు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పుల్లెపు సత్తిబాబు దంపతులచే మర్లప్రభాకర సోమయాజులు ఆధ్వర్యంలో మర్ల రాజా, సబితాల శంకర శర్మలు శాస్త్రోక్తంగా ద్వాదశ జ్యోతిర్లింగాలకు రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సహస్ర కుంకుమార్చన స్వామివారికి సహస్ర బిల్వదళ అర్చన జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కోరుకొండ సీఐ వై. సత్యకిషోర్, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు, స్టడీ మెటీరియల్ పంపిణీ


ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్న ఎన్ఆర్ఐ ప్రవీణ్‌రెడ్డి

బిక్కవోలు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పందలపాక హైస్కూల్ ప్లస్‌లో 30మంది ఇంటర్ విద్యార్థినిలకు రూ.50వేల విలువైన ఏకరూప దుస్తులు, స్టడీ మెటీరియల్‌ను ఎన్ఆర్ఐ పడాల ప్రవీణ్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి పడాల కృష్ణారెడ్డి పేరున వున్న ఈపాఠశాలను ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఈ పాఠశాలను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన తండ్రి కోరిక మేరకు పాఠశాలకు ఏ అవసరమొచ్చినా తమ కుటుంబం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కోణాల సత్తిరాజు, హెచ్ ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పీజీటీలు కర్రి వీరెడ్డి, నాగబాబు, ఆదినారాయణ, పీడీ యువరాజారెడ్డి పాల్గొన్నారు.

దేవాలయాల నష్ట పరిహారానికి ప్రతిపాదనలు

రంగంపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం పరిధిలో ఏడీబీ రోడ్డు విస్తరణలో భాగంగా రో డ్డుకు ఇరువైపులా ఉన్న దేవాలయాలను కూల్చేందుకు ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందన్నారు. మండల పరిధిలో కూల్చేస్తున్న ఆరు దేవాలయాల నష్టపరిహారం కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అంచనా వేసేందుకు ప్రతిపాదనలు పంపేందుకు బుధవారం రంగంపేట తహశీల్దార్ ఉండవిల్లి రంజిత్‌కుమార్ ఎస్టీరాజాపురం, వడిశలేరు, రంగంపేట, కోటపాడు గ్రామాల్లో పర్యటించి దేవాలయాలను పరిశీలించి కూటమి నాయకులతోనూ, దేవాలయ కమిటీ సభ్యులతోనూ, గ్రామస్తులతోనూ చర్చించారు. వాటి వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని తహశీల్దార్ రంజిత్‌కుమార్ తెలిపారు. ఆయనతో పాటు ఆయా గ్రామాల వీఆర్వోలు ఉన్నారు.

న్యాయ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన వారిని శిక్షించాలి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం పోతినమల్లయ్యపాలెంలో న్యాయవిద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై అకృత్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మహిళా రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. బాధిత విద్యార్థినికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దినేష్, రోహిత్, ప్రవల్లిక, అరుణ స్వాతి, మాధురి, సంఘవి, కుశల, సరస్వతి పాల్గొన్నారు.

బాలల హక్కులను హరిస్తే చర్యలు

● రాజానగరంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ తనిఖీలు


వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో అధికా రులు

రాజానగరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను కాలరాస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని రాజమహేంద్రవరం సర్కిల్-4 అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.లలితాకుమారి పేర్కొన్నారు. పోలీసు, విద్యా, కార్మికశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో బుధవారం పలు దుకాణాలు, సర్వీసింగ్ సెంటర్లు, మెకానిక్ షెడ్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 18సంవత్సరాలలోపు బాల, బాలికలను పనిలో పెట్టుకోవడం, పనులు చేయించడం చట్టరీత్యా నేరంగా పరిగణిస్తామన్నారు. సదరు దుకాణదారులు, నిర్వాహకులకు బాల కార్మిక చట్టాలు గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కానిస్టేబుల్స్ విజయకుమార్, మహ్మద్ అలీ, క్రాఫ్ట్ జిల్లా కోఆర్డినేటర్ బి.రాజ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ పద్మ పాల్గొన్నారు.

పిల్లలు క్రమశిక్షణతో మెలగాలి : డీఎల్ఎస్ఏ

రాజమహేంద్రవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పిల్లలు క్రమశిక్షణతో మెలుగుతూ మంచి అలవాట్లు అలవర్చుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. అంత ర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల జీవితాలను సరైనమార్గంలో నడిపిం చాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులపై ఉందన్నారు. బాల్య వివాహా లు, బాలకార్మిక వ్యవస్థ, వారితో భిక్షాటన వంటివి చేయించడం నిర్మూలించడంలో సమాజం తన బాధ్యత ను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఎలాంటి న్యాయ సమస్యలు ఉన్నా డీఎల్ఎస్ఏని ఆశ్రయించవచ్చని చెప్పారు. అనంతరం పిల్లలకు బహుమతులను అంద జేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో విజయ కుమారి, ఎంఈవో దిలీప్ కుమార్, ఏఎల్‌వో విజయ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

దేశపురోభివృద్ధిలో విద్యార్థి పాత్ర కీలకమే

● భాష్యం రామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న భాష్యం చైర్మన్ రామకృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దేశ పురోభివృద్ధిలో విద్యార్థుల పాత్ర చాలా కీలకమని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం జేకే గార్డెన్స్‌లో బుధవా రం 1100 మంది విద్యార్థులతో ఆయన ఇంట్రాక్షన్ అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత మైన స్థానాలకు విద్యార్థులు ఎదగాలంటే ఉత్తమమైన ప్రతిభను చూపాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. అనంతరం ముఖ్యసలహాదారుడు మైకల్ రాజు మాట్లాడుతూ జీవితానికి వెలుగునిచ్చేది ఉపాధ్యాయుడే అన్నారు. అనంతరం విద్యార్థులకు భోజనాలను రామకృష్ణ స్వయంగా వడ్డించారు. భాష్యం జోనల్ ఇంచార్జీలు వల్లూరి గోవిందరాజులు, వి.ఆంజనేయులు, బ్రాంచ్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బిక్కవోలు ప్రాచీన ఆలయాలను దర్శించిన గన్నికృష్ణ


గోలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న గన్ని కృష్ణ దంపతులు

బిక్కవోలు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామంలోని ప్రాచీన ఆలయాలను బుధవారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ దంపతులు దర్శించారు. ముందుగా లక్ష్మీగణపతిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోలింగేశ్వర, కుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లను దర్శించారు. షష్ఠి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరె డ్డి గన్ని దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో లక్ష్మీగణపతి ఆలయ కమిటీ ఛైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, షష్ఠి ఉత్సవ కమిటీ సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, నందిపాటి కిషోర్, పల్లి రాజారెడ్డి, తొండాపు సత్యనారాయణరెడ్డి, కొమ్మోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

షష్ఠి మహోత్సవాలకు రాట

రాజానగరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి 98వ షష్ఠి మహోత్సవాల నిర్వహణలో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9.38కు ఆలయ ప్రాంగణంలో రాట ముహూర్తానికి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ డిసెంబరు 7న ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలను ఐదురోజులపాటు ఘనంగా నిర్వహిస్తామన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపా ధ్యక్షుడు గ్రంధి నానబ్బులు, రాజానగరం మండలాధ్యక్షుడు మండవిల్లి వెంకన్నబాబు, గౌరవాధ్యక్షుడు కంకటాల సత్యనారాయణ, గ్రామకమిటీ అధ్యక్షుడు సముద్రాల రాంబాబు, దవులూరి శ్రీను, గిరి, గ్రంధి రాజా, కంకటాల మహేష్, రామకృష్ణ, రాజు, పాలూరి ఏడుకొండలు పాల్గొన్నారు.

అల్లూరి జిల్లా నేషనల్ క్రిస్టియన్ బోర్డు ఏర్పాటు


ఎన్నికైన అల్లూరి జిల్లా నూతన కమిటీ

రాజమహేంద్రవరంరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్రిస్టియన్ బోర్డు జాతీయ నాయకులు జాన్‌మాస్క్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం ఆనందనగర్ జేరూసలేం ప్రేయర్ పెలోషిప్ చర్చిలో బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా నేషనల్ క్రిస్టియన్ బోర్డు ప్రకటించి కమిటీని ఎంపిక చేశారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి.నవీన్‌కుమార్, రాష్ట్ర ఉపా ధ్యక్షుడు బి.అమృతరావు, సెక్రటరీ డేవిడ్ మార్క్ లు జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. అల్లూరి జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్ ఎం.డేవిడ్ రాజు, ఉపాధ్యక్షుడిగా పి.డేవిడ్, సెక్రటరీగా సి. విజయ రాజు, జాయింట్ సెక్రటరీగా ఎస్. ఇర్మియా, కోశాధికారిగా వి.రవికుమార్‌లను నియమించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

● గ్రంథాలయ వారోత్సవాల్లో హెచ్ఎం కళ్యాణి


విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అనపర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పఠనాశక్తిని పెంచుకోవడం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదుగుతారని అనపర్తిలోని బాలికోన్నత పాఠశాల హెచ్ఎం కళ్యాణి అన్నారు. బుధవారం గ్రంథాలయాధికారి అభిలాష్ అధ్యక్షతన పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు హెచ్ఎం బహుమతులు అందజేశారు. స్థానిక గ్రంథాలయాధికారి అభిలాష్, ఉపాధ్యాయులు వైబీఎస్ ఆచార్యులు, నాయుడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు పార్కులో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో భాగంగా పిల్లలకు పాటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల అంద జేశారు. ఈ కార్యక్రమంలో అశోక్‌కుమార్, మహంతి లక్ష్మణరావు, మారిశెట్టి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. గౌతమీ గ్రంథాలయంలో శ్రీలక్ష్మీ కృష్ణ నృత్యాలయం శిష్యబృందంచే నృత్యప్రదర్శన, అనంతరం విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో పీవీఎస్ కృష్ణారావు, ఎ.నారాయణరావు,మారిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సీతంపేట గ్రంథాలయంలో ప్రముఖ ఇంద్రజాలికుడు కంభంపాటి శ్రీనివాసరావు నిర్వహించిన మ్యాజిక్ షో అందరినీ ఆకర్షించింది. ఈ కార్యక్రమానికి పంతం కొండలరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంమల్లికార్జునరావు, వరద నాగేశ్వరరావు, తాతారావు ఎంవీరలింగం పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాయల వారోత్సవాలు

కడియం: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా లైబ్రేరియన్ శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు బుధవారం జరిగింది. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డ్రీమ్స్ స్కూల్ అంగర రమేష్ విజేతలకు మెరిట్ సర్టిఫికెట్, వాటర్‌బాటిల్స్, జీకే బుక్స్ అందజేశారు. సీహెచ్ శ్రీనివాసరావు, గొల్లపల్లి సత్యనారాయణ, విశ్రాంత ఎంఈవో వి.లజపతిరాయ్, మెడికల్ నోడల్ ఆఫీసర్ ఎంబీవీ రామకృష్ణ, బోణం సత్యనారాయణ, తోరాటి వసంతరావు, చిలుకూరి వెంకటేశ్వరరావు, డా. గుర్రాల వెంకట్రావు పాల్గొన్నారు.

మేధో సంపత్తికి గ్రంథాలయాలు దిక్సూచి

రంగంపేట: మేధో సంపత్తికి గ్రంథాలయాలు దిక్సూచిగా దోహదపడతాయని రంగంపేట ఐసీడీఎస్, సీడీపీవో జెస్సీ ఫ్లోరెన్స్ అన్నారు. బుధవారం స్థానిక రంగంపేటశాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు, బహుమతి ప్రధానం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వివిధ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. అనంతరం పీఈటీ ఉపాధ్యాయురాలు శైల, క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలు బి.లక్ష్మీలను సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో బి.రామాచార్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సరీ రైతులకు ఉచిత వైద్య శిబిరం

కడియం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కడియం సర్ ఆర్థర్‌కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నర్సరీ అసోసియేషన్ కార్యాలయం వద్ద బుధవారం ఉచిత వైద్యశిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ వైద్యశిబిరం డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి, సాయిరామ్ దంత వైద్యశాల, డా. మోహన్ డయాబెటిక్ సెంటర్, స్మార్ట్ ఎమర్జెన్సీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, పల్స్ ఆస్పత్రి వైద్యసేవలు అందించారు. డా. ఎస్ విజయ, డా. గౌతమ్, డా. సజీవ్‌రాజు, డా. కె లక్ష్మణ్, డా. స్రవంతి, డా. ప్రజ్ఞలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరా జు, ఉపాధ్యక్షుడు పెనుమాక కొండబాబు మాట్లాడుతూ అసోసియేషన్ గత కొన్నేళ్లుగా ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తుందన్నారు. సంఘం కార్యవర్గ సభ్యులు గాద నాగేశ్వరరావు, రావిపాటి రామకృష్ణ, గరగ నాగేశ్వరరావు, తాడాల నాగేశ్వరరావు, పిల్లా శ్రీనివాస్, అడ్డగర్ల రమేష్, నర్సరీ పెద్దలు మార్గాని సత్యనారాయణ, తిరుమలశెట్టి భాస్కరరావు పాల్గొన్నారు.


కాటన్ మహాశయుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నర్సరీ ప్రతినిధులు

కెరీర్ గైడెన్స్‌పై అవగహన

రాజమహేంద్రవరంరూరల్, నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి): సత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూరల్ మండలం కోలమూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ సభ్యులు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్, జీఎస్టీ అధికారి కేవీఎస్ రవికుమార్, టీవీ రవి తదితరులు విద్యార్థులకు చదువు, వారి భవిష్యత్‌కు సంబంధించి పలు సూచనలతోపాటు, మానవత్వ విలువలు, క్రమశిక్షణ, మోటివేషన్ తదితర అంశాలపై వివరించారు. శ్రీరామమూర్తి, కసిరెడ్డి దుర్గాప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పారావు పాల్గొన్నారు.


కెరీర్ గైడెన్స్‌పై మాట్లాడుతున్న సభ్యులు





31 స్కూటీలు, బైక్‌లు సీజ్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతలకు భంగం కలి గించే అసాంఘిక శక్తులను ఉపేక్షించమని ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో బుధవారం తెల్లవారుజామున డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది బృందాలుగా ఏర్పడి విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. శాంతి భద్రతలకు భంగం కలి గించే అసాంఘిక శక్తులను ఉపేక్షించబోమని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా చట్ట వ్యతిరేక కార్యక్రమాలను అరికట్టాలంటే ప్రజలు నుంచి సహకారం ఎంతైన అవసరమని ఏదైనా సమాచారం ఉంటే దగ్గరలో ఉన్న పోలీస్ వారికి లేదా, 112 కి సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయన్నారు. జిల్లా వ్యా ప్తంగా వివి ధ ప్రాంతాల్లో నెంబరు ప్లేట్లు లేని ,రికార్డులు లేని 31 స్కూటీలు,బైక్‌లను పోలీసులు సీజ్ చేసినట్టు చెప్పారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని గుర్తించిన ప్రాంతాల్లో అణు వణువు క్షుణ్ణంగా సోదాలు చేసి సారా,అక్రమ మద్యం, మందుగుండు సామగ్రి,అనుమానితవ్యక్తుల ఆరా తీశారన్నారు.







బాబోయ్.. రైలు ప్రమాదం!

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైలు బోగి నుంచి పొగలు వస్తున్నాయి.. మరో వైపు సిబ్బంది అంతా ఉరుకులు పరుగులు పెడుతున్నారు.. కొందరు రక్తం కారుతున్న ప్రయాణికులు కిందకు దించు తుంటే.. మరికొందరు కట్టుకడుతున్నారు.. ఇం కొందరు అంబులెన్స్‌లు ఎక్కించి ఆసుపత్రికి తరలిస్తున్నారు..ఇంకో వైపు రైల్వే సిబ్బంది బోగీ పరిరక్షణ చర్యల్లో ఉన్నారు. బుధవారం ఉద యం 11 గంటలకు రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్ వద్ద ఒక భయానక వాతావరణం సృష్టించారు.స్థానికులంతా ఏదో జరిగిందని అను కుంటున్నారు. కంగారుపడుతు న్నారు.. చివరికి ఇదంతా కోల్ సైడింగ్‌లో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్పీ ఎఆర్ఎంవీ సిబ్బంది మాక్ డ్రిల్ అని తెలియడంతో ఊపిరిపీల్చుకున్నారు. రైలు ప్రమాదాలు జరిగిన సమయంలో ఎంత వేగంగా స్పందిస్తాం అనే దానిని సమర్థవం తంగా చేసి చూపినట్టు ఏడీఆర్ఎం ఆపరేషన్స్ శ్రీనివాస కొండ తెలి పారు. రైలు ప్రయాణాన్ని చేసేట ప్పుడు ప్రయాణికులు చేయవలసిన , చేయకూడని పనులు వివరించారు.జేసీ చిన్ని రాముడు మాట్లా డుతూ ప్రమాదాల సమ యంలో ఎంత వేగంగా స్పందిస్తే అంత తక్కువ సంఖ్యలో ప్రజలను రక్షిం చవచ్చని చెప్పారు. 100 మంది రైల్వే సిబ్బంది, రెస్క్యూ బృందాలు మాక్‌డ్రిల్‌లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ ఎం.సుజీ, సీనియర్ డీఎస్‌వో బి.ప్రశాంత కుమార్, సీనియర్ డీఎంఈ ఏ.సంజయ్, డీఈ ఎన్ నార్త్ సిహెచ్ గోతం, డీసీఎం ఎండి అలీఖాన్, డీఈఈ గురు శ్రీనివాస్, డీఎస్‌టీఈ జె.నారాయణరావు ఏడీఎంఈ సీఎన్‌డబ్ల్యూ డిఆర్ రాజేష్, ఏడియన్ ముత్యాలరావు, ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ ,రాజీబ్ దర్భియా ఎస్‌సీఆర్ కెఎల్ఎన్ స్వామి, సివిల్ డిఫెన్స్ ఎస్‌సీఆర్ డీవై కంట్రోలర్ టి.సుధీర్‌బాబు, వి.కళ్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే బత్తుల భేటీ

రాజానగరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలపై సీఎం చంద్రబాబు నాయుడితో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బుధవారం భేటీ అయ్యారు. నియోజకవర్గంలో తాగు, సాగునీరు, పురుషోత్తపట్నం భూముల నష్ట పరిహారం,కోరుకొండ భూముల రిజిస్ట్రేషన్ సమస్యలు, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు, పీహెచ్‌సీల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను సీఎం చంద్రబాబు నాయుడికి వివరించి వినతిపత్రం అందజేశారు. సీఎం సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కరించే దిశగా హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే బత్తుల తెలియజేశారు.

పుష్కర పనులు ఆరంభించాలి అసెంబ్లీలో ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గోదావరి పుష్కరాలకు వచ్చే యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఇప్పటినుంచే పుష్కర పనులను ప్రారంభించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు 8వ రోజు బుధవారం 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలపై అసెంబ్లీలో ప్రస్తావించారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి దేశ నలుమూలల నుంచి యాత్రికులు లక్షలాదిగా తరలివస్తారన్నారు. కొవ్వూరు పట్టణాభివృద్ధికి అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. వచ్చే పుష్కరాలకు రోజుకు 12.50 లక్షల మంది, 12 రోజులకు 1.50 కోట్ల మంది యాత్రికులు వస్తారని అంచనా అన్నారు. ప్రస్తుతం కొవ్వూరులో 11 గోదావరి స్నానఘట్టాలు ఉన్నాయని, వాటికి అదనంగా మరో 3 స్నానఘట్టాలు నిర్మించాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డిసెంబరు 5న బ్యాలెట్ పేపరు ఉపయోగించి టీచర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఏఆర్‌వో, సహాయ ఎన్నికల సిబ్బందికి పోలింగ్ కేంద్రాలు నిర్వహణ, పోలింగ్ విధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఎన్నికలపై అధికారులు, సిబ్బంది స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాలెట్ బాక్సు, బ్యాలెట్ పేపరు ,మార్క్, కాపీ పేపరు, సీల్, మెటల్ సీల్, రబ్బర్ స్టాంప్, ఫారం 14,15,16 పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.శిక్షణ తరగతుల్లో ఆర్‌డీవోలు కృష్ణనాయక్, రాణి సుస్మిత, ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి ఎం.మాధురి ,తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరి ఆరోగ్యం కోసం పనిచేస్తున్న తమకు స్థూలమూల వేతనం చెల్లించాలని వైద్య, ఆరోగ్యశాఖలోని కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులైన ఆరోగ్య సహాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రం ఎదుట ఖాళీపేట్లతో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. గత ప్రభుత్వం జీవో జారీ చేసి చేతులు దులుపుకుని మోసం చేసిందని, తాము అర్ధాకలితో జీవితాలు సాగిస్తున్నామన్నారు.



రుడా నిధులు హాంఫట్!



నాడు వైఎస్ఆర్ విగ్రహం వద్ద రూ.20 లక్షల పైబడి నిధులతో చేసిన సుందరీకరణ

అనపర్తి,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో అంతా వారిష్టమే.. కావాలంటే పనులు చేశారు.. లేదంటే బిల్లులు చేయించేసుకున్నారు..ఎక్కడికక్కడ ఆక్రమించేసి ఇష్టానుసారం భవనాలు నిర్మించేసుకున్నారు. అయినా అడిగే నాథుడు లేడు.. గత ఐదేళ్లు పట్టించుకున్నవారు లేరు. జిల్లా వ్యాప్తంగా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. రుడా పరిధిలో ఉన్నా అక్రమాలకు అడ్డే లేకుండా పోయింది.. ఇటీవల అనపర్తిలో వెలుగుచూసిన సంఘటన మరో ఉదాహరణ..గత వైసీపీ హయాంలో రాజమహేంద్రవరం రూరల్ డవలప్‌మెంట్ అథారిటీ పేరుతో ఏర్పాటు చేసిన రుడా సంస్థ పరిధిలో చేపట్టిన అనేక నిర్మాణాలు కళ్ళకు కట్టినట్లు సాక్షీ భూతాలుగా నిలుస్తున్నాయి.

నాడు నాసిరకంగా పనులు..

రుడాకు సమ కూరిన సొమ్ముల్లో కొంత భాగాన్ని గ్రామాభివృద్ధికి మంజూరు చేస్తారు. పార్కులు, ప్రధాన కూడళ్లలో సుందరీకరణ వంటి

గత ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో దోపిడీ

పనులు చేస్తారు. గత ప్రభుత్వంలో అనేక నిధులు కేటాయించి నాసిరకంగా పనులు చేసి దోచుకున్నారు.అనపర్తి నియోకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో రుడా నిధులతో నిర్మాణాలు చేపట్టిన అనేక చోట్ల అవినీతి రాజ్యమేలిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆరోపిస్తూ వీటి పై విచారణ చేయాలని అధికారులను కోరారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఇళ్ల స్థలాల్లో భారీ అవినీతి జరిగిందని ఇప్పటికే అసెంబ్లీ సాక్షిగా గళమెత్తారు.అభివృద్ధి పనుల్లో జరిగిన అవినీతిని ప్రస్తుత పాలకులు ప్రశ్నిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా నిధులు..

బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో పెద్ద చెరువును అభివృద్ధి చేయాలన్న తలంపుతో రూ.1.50 కోట్ల నిధులను మంజూరు చేయించారు.ఈ నిధులతో ట్యాంక్‌ను శుభ్రపరచడం.. గట్టును పటిష్ట పర్చడం, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం,చిన్నారులు ఆడుకునేందుకు పార్కును ఏర్పాటు చేయడం వంటి పనులకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని కాంట్రా క్టరుకు పనులను అప్పగించారు. అయితే ఈ పనుల పర్యవేక్షణ రుడా రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్‌కు అప్పగించింది.బలభద్రపురం మెట్ట ప్రాంతంలో దిగువ గ్రామం కావడంతో భారీ వర్షాలకు పైనున్న చెరువులు పొంగితే బల భద్రపురంలోని పెద్ద చెరువు గ్రామానికి కాపుకా యడంతో పాటు గ్రామాన్ని ముంపునకు గురి కాకుండా రక్షించేది.అయితే చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా చెరువుకు నీరు వచ్చే మార్గాన్ని ..నీరు బయటకు వెళ్లే మార్గాన్ని మూసివేయడంతో భవిష్యత్‌లో వరదలు వస్తే గ్రామాన్ని రక్షించే పెద్ద చెరువు కూడా రక్షణ కల్పించలేని పరిస్థితి వచ్చిందని గ్రామస్థులు వాపోతున్నారు. అంతే కాకుండా పూర్తి స్థాయిలో పనులు చేయకుండానే బిల్లులు చెల్లింపు జరగడం గమనార్హం. దీనిపై ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులు, కాంట్రాక్టరును ప్రజల వద్దకే రప్పించి చెరువు అభివృద్ధి పనులపై సమీక్ష చేయడంతో అనేక అవకతవకలు బయటపడ్డాయి. అనపర్తి నడి బొడ్డున ఉన్న కళావేదిక అభివృద్ధికి రుడా నుంచి రూ.39 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు రాజమహేంద్రవరానికి చెందిన కాంట్రాక్టరే చేపట్టారు. కళా వేదికకు రెండు వైపులా గోడల నిర్మాణం, సుమారు 20 కిటికీలు, ఐదు గుమ్మాలను యుపీవీసీతో ఏర్పాటు చేసేందుకు రూ.39 లక్షలు మంజూరు చేశారు. ఇంత చిన్న పనికి రూ.39 లక్షలా అంటూ గ్రామస్థులు ముక్కున వేలేసుకుంటున్నారు. అనపర్తి కెనాల్ రోడ్డులో వైఎస్ఆర్ విగ్రహం వద్ద రుడా నిధులు సుమారు 20 లక్షల పైబడి నిధులు వెచ్చించారు. అక్కడ మొక్కలు నాటడం, వాటర్ ఫౌంటేయిన్ ఏర్పాటు చేయడం మినహా అభివృద్ధి చేసిందేమందని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఇలా జిల్లాలో అనేక చోట్ల రుడా నిధులు పక్కదారి పట్టాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం గ్రామంలో అనేక అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. మెయిన్‌రోడ్డును ఆనుకుని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు కన్నెత్తి చూడక పోవడం గమనార్హం.నూతనంగా రుడా బాధ్యతలు చేపట్టబోతున్న కార్యవర్గం గతంలో జరిగిన పనులపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని.. అక్రమ నిర్మాణాల బాధ్యులపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- అసంపూర్తిగా పనులు
- అయినా బిల్లులు మంజూరు
- అనపర్తి చెరువులో తినేశారు
- కళావేదికలో మింగేశారు
- వైఎస్ విగ్రహం చుట్టూ సుందరీకరణకు రుడా నిధులే
- సాగుతున్న అక్రమ నిర్మాణాలు
- నేటికీ అడ్డుకోలేని అధికారులు
- కొత్త రుడా కార్యవర్గంపై ఆశలు



కళావేదిక గోడలకు రూ.39 లక్షలు



అక్రమ నిర్మాణం కూల్చివేత

గోకవరం, నవంబరు20(ఆంధ్రజ్యోతి): గోక వరం మండలం కృష్ణుడిపాలెం గ్రామంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డుగోలుగా నిర్మిం చిన అక్రమ కట్టడాన్ని బుధవారం అధికారులు కూల్చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపం (కొత్తూరు రోడ్డు)లో ఉన్నటువంటి ఖాళీ స్థలంను కొంతకాలం కిందట కొంతమంది వ్యక్తులు ఆక్రమించారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి శివయ్య ఆక్రమణలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. అప్పటి ఎంపీడీవో పద్మజ్యోతి ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. స్థలం ఆక్రమణ సరికాదని ఆదేశాలిచ్చారు. అయి నప్పటికీ గ్రామానికి చెందిన కొందరు రేకుల షెడ్ నిర్మించారు.ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రస్తుత ఎంపీడీవో గోవింద్ ఆదేశాలతో పంచాయితీ కార్యదర్శి రమణ కుమారి పోలీసుల సహకారంతో అక్రమ కట్ట డా న్ని కూల్చి స్థలాన్ని అంగన్‌వాడీకి అప్పగించారు.



వాట్సాప్‌తో ధాన్యం కొనుగోళ్లు
73373 59375 నెంబర్‌కు హాయ్ అని పెడితే సమాచారం

రాజానగరం,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న అన్నదాతకు ఏపీ ప్రభుత్వం తీపి కబురు పంపింది.ధాన్యం విక్రయాల్లో అన్నదాతలు పడుతున్న అవస్థలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయించేలా ప్రత్యేక నెంబరును అందుబాటులోకి తెచ్చింది. అన్నదాతలు ముందుగా ప్రభుత్వం సూచించిన వాట్సాప్ మొబైల్ 73373 59375 నంబరుకు రైతు తన మొబైల్ ద్వారా హాయ్ అని మెసేజ్ చేస్తారు. దీంతో ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థ తక్షణ స్వాగతం పలుకుతుంది. ధాన్యం అమ్మే సమయాన్ని షెడ్యూల్ చేసుకోమని చెబుతుంది. ఇందుకు షెడ్యూల్ బటన్ క్లిక్ చేసి ఆధార్ నంబరును ఎంటర్ చేయాలి. వెంటనే ధాన్యం అమ్మాలనుకున్న కొనుగోలు కేంద్రం పేరును క్లిక్ చేయాలి. మీరు ఏ రోజు ధాన్యాన్ని అమ్మాలనుకుంటున్నారో ఆ తేదీని,ఆ రోజు ఏసమయంలో అమ్మదలచుకున్నారో టైమ్ స్లాట్ ను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు మీరు అమ్మాలనుకున్న ధాన్యం ఏ రకానిదో క్లిక్ చేసి చెప్పాలి. అ తర్వాత ఎన్ని బస్తాలు అమ్మదలచుకున్నారో చెప్పాలి. అంతే మీ ధాన్యం కొలుగోలు ప్రక్రియ నిర్ధారించబడుతుంది.సంబంధిత వివరాలతో పాటు ఒక కూపన్ కోడ్ ఇస్తూ సదరు మొబైల్‌కు ఒక మెస్సేజ్ వస్తుంది. దీని ప్రకారం ఆ సమయానికి వెళ్లి ఎలాంటి నిరీక్షణ లేకుండా ధాన్యాన్ని అమ్ముకోవచ్చు.

ముగిసిన శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించడం ద్వారా వారిని వ్యాధుల బారినుంచి కాపాడవచ్చని జిల్లా ఇన్‌ఛార్జి మలేరియా అధికారిణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జే.సంధ్య అన్నారు.రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో బుధవారం ఆరోగ్యసహాయకులకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. వాతావరణ మార్పులతో సంభవించే వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాలను గ్రామాల్లో ఆరోగ్య సహాయకులు సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు, సీనియర్ ఎంటమాలజిస్ట్ ఐ.రామకృష్ణారావు, ఏపీ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీవీవీ ప్రసాద్, జిల్లాలోని ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రి సమస్యలు పరిష్కరిస్తాం
కార్మిక మంత్రి సుభాష్ హామీ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసౌకర్యాలు కల్పిస్తామని, త్వరలోనే అవసరమైన సిబ్బందిని భర్తీ చేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కార్మిక సంఘాల నాయకులకు హామీ ఇచ్చారు. ఈఎస్ఐ ఆసుపత్రిలో కనీస వైద్య సౌకర్యాలు లేవని, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని మంగళవారం సీపీఐ, ఏఐటీయూసీ, ఇతర కార్మిక సంఘాల నాయకులు ఆందోళనకు దిగిన నేపథ్యంలో మంత్రి సుభాష్ స్పందించారు. ఈ మేరకు సీపీఐ జిల్లా కార్యదర్శి మధు ఒక ప్రకటన విడుదల చేశారు.

రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే పీడీయాక్ట్
జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసాద్

కొవ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ప్రతి నెల 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రసాద్ తెలిపారు. కొవ్వూరులో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దేవరపల్లి, రాజానగరం, పెరవలి, నిడదవోలు, చాగల్లు మండలాల సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ల బృందం కలిసి చాగల్లు మండలం కలవలపల్లి, నిడదవోలు మండలం సూరాపురం గ్రామాల్లో రేషన్ బియ్యం అక్రమ కొనుగోళ్లు, అమ్మకాలపై తనిఖీలు చేపట్టామన్నారు. ఫణికుమార్, మెట్లపర్తి రాజు, కోలా రాజేష్, వద్దిరెడ్డి దుర్గారావుల నివాస గృహాలను తనిఖీలు చేశామన్నారు. నిడదవోలు, చాగల్లు మం డలాల్లోని ఆయా గ్రామాలలోని కోళ్ళఫారంలు, రైస్‌మిల్లులను తనిఖీ చేశామన్నారు. ఎటువంటి రేషన్‌బియ్యం లభ్యం కాలేదన్నారు.రేషన్ బియ్యం కొనుగోళ్లు, అమ్మకాలు చేపడితే క్రిమినల్, పిడి యాక్టు కింద కేసులు నమోదు చేస్తామన్నారు.ఆయన వెంట కొవ్వూరు సివిల్ సప్లయిస్ డీటీ సునీత ఉన్నారు.



చాగల్లులో డీఎస్‌వో తనిఖీలు

రోడ్డు కంరైలు బ్రిడ్జికి 50 ఏళ్లు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రోడ్డు కంరైలు బ్రిడ్జి గోల్డెన్ జూబ్లీ ఉత్సవం బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు చేశారు. సబ్బెళ్ళ విజయ దుర్గారెడ్డి మాట్లాడుతూ ఆనాడు ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో నిర్మించిన రోడ్డుకంరైలు వంతెనను 1974 నవంబరు 20న అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ప్రారంభించారన్నారు. ఇప్పటికి 50 ఏళ్ళు పూర్తయిందన్నారు. 1967లో నిర్మాణం ప్రారంభించి 1974కు పూర్తిచేశారని తెలిపారు. అంతకు పూర్వం రాజమహేంద్రవరం కొవ్వూరు మధ్య పడవులు, లాంచీలు, పంట్లుపై ప్రయాణించే వారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబి, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు షాజహాన్, విజయ్‌శ్రీరాం, కామేష్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వంగలపూడి -1,2 రీచ్‌ల అనుమతులు రద్దు : జేసీ

సీతానగరం,నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : వంగలపూడి 1,2 ఇసుక రీచ్‌లు రద్దుచేస్తున్నట్టు జేసీ చినరాముడు ప్రకటించారు. వంగలపూడ ఇసుక ర్యాంపు వద్ద స్థానికులకు, యాజమాన్యానికి మధ్య ధరల విషయమై గొడవ జరిగిన నేపథ్యంలో బుధవారం జేసీకి వాట్సాప్ మెసెజ్‌ల ద్వారా ఫిర్యాదులు చేశారు.ఓపెన్ రీచ్ పాయింట్ వద్ద వంగలపూడి-1 నుంచి టన్ను ఇసుక ధర రూ 67.59లు వంగలపూడి-2 వద్ద టన్ను రూ 70.19లుగా ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం రీచ్ వద్ద రూ.200లు నుంచి రూ.400ల వరకు విక్రయిస్తున్నారని వచ్చిన అభియోగాల మేరు మెసర్సు పాన్ ఇండియా ప్రాజెక్ట్ వారి అనుమతి ఉత్తర్వులను రద్దుచేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ఆర్డర్లు పొందిన లారీలకు స్టాక్ పాయింట్ వద్ద అందుబాటులో ఉన్నంత వరకు ఇసుక ఇవ్వడం జరుగుతుందని తదుపరి రీచ్ మూసివేస్తామన్నారు. ప్రజలు ,ప్రజాప్రతినిధులు వాట్సాప్ మెసేజ్‌లు చేస్తున్నారని తీరా ఆరా తీస్తుంటే చెప్పడం లేదని దీనివల్ల సరైన చర్యలు తీసుకోలేకపోతున్నామన్నారు. లారీ డ్రైవర్లకు మొబైల్ స్లిప్పులు అను శీర్షికన ఏం జరుగుతోందో అంటూ ముందుగానే ఆంధ్రజ్యోతి తెలియజేయడం జరిగింది. దీనిని బలపరుస్తూ బుధవారం స్థానికులు వంగలపూడి ఇసుక రీచ్ వద్ద గుట్టు రట్టు చేశారు.దీంతో ఇసుక రీచ్ మూతపడింది.ఆయన వెంట సబ్ కలెక్టర్ కృష్ణనాయక్, మైన్స్ టెక్నికల్ అసిస్టెంట్ శైలజ ,వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రామ్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.



వంగలపూడి రీచ్ వద్ద మాట్లాడుతున్న జేసీ చినరాముడు

కొవ్వూరు

పుస్తక పఠనంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలలో పుస్తక పఠనం ద్వారా ఎంతో మంది ఉన్నతస్థానాలను అదిరోహించారని కొవ్వూరు డీఎస్పీ జి. దేవకుమార్ అన్నారు. బుధవారం కొవ్వూరు ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవా ముగింపు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులచే స్వీయ పఠన కార్యక్రమం, డిజిటల్ గ్రంథాలయాలపై ఒరియంటేషన్ కార్యక్రమాలను సంస్కృత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్థనం శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎస్పీ దేవకుమార్ మాట్లాడుతూ పోటీలలో పాల్గొనడం వలన విద్యార్థులలో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. గ్రంథాలయాలలో ఉన్న పుస్తకాలను చదవడం వలన మేదస్సు పెరుగుతుందన్నారు. పోటీ పరీక్షలలో పాల్గొని విజయవంతమై ఎంతో మంది ఉన్నత శిఖరాలను అదిరోహించారన్నారు. గత వారం రోజులుగా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఒ-2 కె. రామకిషోర్, గ్రంథాలయ అధికారి జి.వి.వి.ఎస్. త్రినాద్, గోదవర్ధనం శ్రీనివాస మూర్తి, అనిపెద్ది జగన్నాధశాస్త్రి, మనాశ్రీ, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరవలి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశాలు పెరవలి, ముక్కామల, తీపర్రు గ్రంథాలయాలు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న పలువురు వ్యక్తులు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలు అని ప్రతీ గ్రామంలోనూ దేవాలయం విద్యాలయం, గ్రంథాలయాలు అనేవి మూడు ఆలయాలు అని వీటిని ప్రతీ ఒక్కరూ ఆదరించి గౌరవించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తీపర్రులో జరిగిన కార్యక్రమంలో కంటిపూడి సూర్యనారాయణ, బోగవల్లి చంటిబాబు, నందమూరి నారాయణరావు, గ్రంథాలయ అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు. ముక్కామలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో బొబ్బిలి బాల సుబ్రహ్మణ్య స్వరూప్, కడియాల సాయి రామారావు, కరుటూరి విశ్వనాథం, మద్దిపాటి సత్యం, పుష్పలత, గ్రంథాలయ అధికారి ఎం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పెరవలిలో ఎంఈఓ 2 షేక్ నూర్జహార్, రామకృష్ణ, గంగోలు జోషప్; వోలేటి నారాయన కుమార్, పి. రవి బాబు , సర్వేశ్వరరావు, ఏడిద సత్యనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చాగల్లు హైస్కూల్ హెచ్‌ఎం సస్పెన్షన్

చాగల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) చాగల్లు జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు సస్పెన్షన్‌కు గురయ్యారు. డీఈవో వాసుదేవరావు తెలిపిన వివరాలు ప్రకారం ఈమేరకు కాకినాడ ఆర్‌జేడీ జి.నాగమణి ఉత్తర్వులు జారీ చేశారు. వీర్రాజు విధుల్లో అలసత్వం వహించడంతో పాటుగా అనర్హులకు టీసీలు విక్రయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సస్పెండ్ సమయంలో జిల్లా దాటి వెళ్లరాదని ఉత్తర్వులలో పేర్కొన్నారు. గత సంవత్సరం వైసీపీ ప్రభుత్వం హయాంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఆయన సస్పెండ్ కావడంతో ఆ హైస్కూల్ ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది.

రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే క్రిమినల్ కేసులు

చాగల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం పక్కదారి పట్టించే వారిపై ప్రభుత్వం క్రిమినల్ కేసులు నమోదు చేస్తుందని సీఎస్‌టీడీ సుజాత హెచ్చరించారు. రేషన్ బియ్యం అక్రమ కొనుగోలు అమ్మకాలు నిర్వహిస్తున్నారనే పిర్యాదు మేరకు బుధవారం మండలంలోని కలవలపల్లిలోని రైస్‌మిల్లులు, కోళ్ళఫారంలు, అనుమానం ఉన్న కొందరు వ్యక్తులు ఇళ్లల్లో ప్రత్యేక బృదం సోదాలు చేసినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెలలోను ఈవిధంగా తనిఖీలు జరుగుతాయని చెప్పారు. అక్రమాలకు పాల్పడినట్లు గుర్తిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటుగా పీడీ యాక్టు కూడ పెడతాయని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

నిడదవోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని బుధవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీజీవీ తిలక్, సబ్ ఇన్‌స్పెక్టర్ పి.శోభన్ కుమార్ పరిశీలంచారు. త్వరలో జరుగనున్న పోలింగ్‌కు సంబంధించి ఈ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంట్‌పై అవగాహన సదస్సు

కొవ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంట్‌పై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని దొమ్మేరులోని యలమర్తి శ్రీరాంప్రసాద్‌కు చెందిన ఫంక్షన్ హాలులో బుధవారం పడి, గోవర్ధనగిరిమెట్ట, కాపవరం ప్రజలకు బయో ఎనర్జీ ప్లాంట్‌పై అపోహలను తొలగించారు. టీడీపీ నాయకులు పొట్రు సిద్దూ మాట్లాడుతూ బయో ఎనర్జీ ప్లాంట్ నిర్మాణంపై పరిసర ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. పంగిడి నవభారత్ కాలనీ నుంచి వర్షపునీరు, వాడుకనీరు వచ్చే మార్గంలో అడ్డుగా ప్లాంట్ ప్రహరీ నిర్మించారు. వర్షాకాలంలో నీరు ఎగదన్ని కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతారన్నారు. బయో ఎనర్జీ ప్లాంట్ వలన ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేదని అవగాహన కల్పించాలన్నారు. నవభారత్ కాలనీని రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలన్నారు. మాజీ ఎంపీపీ పీకె రంగారావు మాట్లాడుతూ ప్లాంట్ నిర్మాణంపై పంగిడి, కాపవరం గ్రామాలలో ప్రజలకు ఎటువంటి ప్రమాదం లేదని క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభించిన తరువాత ఏమైనా విష వాయువులు వెలువడతాయా, ఉత్పత్తి చేసే గ్యాస్ వలన ప్రమాదం ఉందా, పొల్యూషన్ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. నివాసాల మధ్యలో ప్లాంట్ నిర్మాణం చేస్తున్నారు ఇబ్బందులు ఉండవా అని అడిగారు. బయో ఎనర్జీ ప్లాంట్‌లో 75 శాతం స్థానిక యువతకు ఉపాధి కల్పించాలన్నారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్లాంట్‌ను ఆనుకుని ఎకరం పొలం ఉందని గతంలో రూ. 50లక్షలకు అడిగారు, ప్రస్తుతం అమ్ముదామంటే రిలయన్స్ ప్లాంట్ ఉందని ఎవ్వరు కొనడానికి ముందుకు రావడం లేదన్నారు. ఇంకా ఇటువంటి ప్లాంట్‌లు రాష్ట్రంలో ఉన్నాయా అని ప్రశ్నించారు. గ్రామస్తులు అడిగిన ప్రశ్నలకు ప్లాంట్ మేనేజర్లు ఆనంద్‌కుమార్, కిరణ్‌కుమార్‌లు పవర్‌పాయింటు ప్రజంటేషన్ ద్వారా అపోహలను నివృత్తి చేశారు. సుమారు 250 కోట్లతో 2 బయో ఎనర్జీ ప్లాంట్‌లు చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో కాకినాడ 3, రాజమహేంద్రవరం 2, కర్నూలు 1, నెల్లూరు 1, విజయవాడ 1, బయో ఎనర్జీ ప్లాంట్‌లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. ప్లాంట్‌లో తయారి అయ్యే కంప్రెషర్డ్ బయో గ్యాస్ వలన ప్రమాదం ఉండదని, ప్రజలు భయాందోళన చెందనవసరం లేదన్నారు. ఎటువంటి పొల్యూషన్ ఉండదని వివరించారు. బయో గ్యాస్ పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడుతుందన్నారు. సర్పంచ్ గోశాల నాగార్జున, వైస్ ఎంపిపి వీరమళ్ళ నారాయుడు, ఎంపిటిసి ఎరుబండి సురేష్, ఉప్పులూరి నానాజి, పొలడుగుల శ్రీనివాస్, ఎస్. సత్యనారాయణ, కొప్పాక విజయకుమార్, పెరుగు పోతురాజు, సత్తిబాబు, రిలయన్స్ ప్రతినిదులు పాల్గొన్నారు.



ప్లాంట్ నిర్మాణంపై అపోహలను తొలగించాలని కోరుతున్న టీడీపీ నాయకుడు పొట్రు సిద్దూ

అగ్ని ప్రమాద బాధితులకు మంత్రి దుర్గేష్ సాయం అందజేత



తాడిమళ్ళలో అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసర వస్తువులు అందిస్తున్న తహసీల్దార్ నాగరాజు నాయక్

నిడదవోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో సర్వంకోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ అన్నారు. బుధవారం నిడదవోలు మండలం తాడిమళ్ళ గ్రామంలో అగ్నిప్రమాద బాధితులను కలసి ఆయన పరామర్శించారు. మంగళవారంరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటియాకుల యిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యింది. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ మాట్లాడుతూ ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి శాఖా మంత్రి కందుల దుర్గేష్ తన సొంత నిదులు 10వేలతో ఆర్థిక సహాయం బాధితులకు అందించేందుకు తమకు పంపారని అన్నారు. ప్రభుత్వ పరంగా అందవలసిన సహాయానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన తెలిపారు. అనంతరం ప్రభుత్వం తరపున నిత్యావసర వస్తువులను వారికి అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన కూటమి నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగనకు అభినందన

నిడదవోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నిడదవోలు మండలం రావిమెట్ల గ్రామానికి చెందిన వెలగన సూర్యారావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బుధవారం రావిమెట్లలోని ఆయన నివాసం వద్ద తెలుగుదేశం పార్టీ శ్రేణులు అయనను ప్రత్యేకంగా అభినందించారు. నిడదవోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా వెలగన సూర్యారావు సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా వెలగన సూర్యారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గౌడ్ కార్పొరేషన్‌కు డైరెక్టర్‌గా నియమించడం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుతున్నానని గౌడ కార్పొరేషన్ ద్వారా గౌడ్‌ల సంక్షేమానికి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, గౌడ సంఘం పెద్దలు పాల్గొన్నారు.



గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన వెలగన సూర్యారావును అభినందిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

సైబర్ నేరాలపై అవగాహన



సైబర్ నేరాలుపై అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ తిలక్

పెరవలి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): రోజువారి కూలీ నుంచి ఉన్నతస్థాయి ఉద్యోగులు, పారిశ్రామిక వేత్తలు సైబర్ బాధితులు అవుతున్నారని సీఐ డీవీసీ తిలక్ పేర్కొన్నారు. సైబర్ నేరాలుపై అవగాహన కార్యక్రమాన్ని పెరవలిలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాట్లాడుతూ సెల్ నేడు ఎంత సౌకర్యవంతంగా మారిందో అంతే ప్రమాదంగా మారిందన్నారు. సైబర్ నేరగాళ్లు ఏ విధంగా మోసం చేస్తారో అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంక్‌నుంచి ఫోన్ చేస్తున్నామని చెబుతూ అకౌంటు, ఆధార్ వివరాలు ఓటీపీలు అంటూ లక్షలాది రూపాయలు నిమి షాల్లో దోచేస్తున్నారని దీనిపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. లోన్ యాప్‌లుద్వారా కూడా పలు మోసాలు జరుగుతున్నాయన్నారు. పదివేలు, 20 వేలు ఎంతో సులభంగా లోను ఇచ్చి వడ్డీలు రూపేనా లక్షలాది రూపాయలు పొందుతారని బాకీ తీర్చకపోతే ఫోటో సేకరించి వాటిని మార్ఫింగ్ చేసి బంధుమిత్రులకు, పంపుతామని బ్లాక్‌మెయిల్‌చేస్తారన్నారు. లోన్‌యాప్‌లు బారిన పడి పలువురు యువతీ యువకులు అనేక మంది ఇటీవల ఆత్మహత్యలు చేసుకున్నారని అందువల్ల సైబర్ నేరాలపై ప్రతీఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్ఐ వెంకట్, ఆయా బ్యాంక్‌ల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో నాగలక్ష్మి

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

నల్లజర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాలికలపై దాడులు, లైంగిక వేధింపులపై వారు అప్రమత్తంగా ఉండాలని గోపాలపురం సీడీపీవో కే నాగలక్ష్మి, ఏసీడీపీవో పద్మావతి అన్నారు. ప్రపంచ బాలల లైంగిక వేధింపుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నల్లజర్ల హైస్కూల్ విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో సంభాషణలు, ఫోన్ చాటింగ్ వంటివి చేయొద్దన్నారు. ప్రలోభాలకు గురి చేసి మోసం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఎవరైనా వస్తువు ఇచ్చినా తీసుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులతో అన్ని విషయాలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది, పాల్గొన్నారు.



పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

కొవ్వూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి సాగు పద్ధతులను పాటించాలని జిల్లా వ్యవసాయధికారి మాధవరావు అన్నారు. బుధవారం కొవ్వూరు మండలం దొమ్మేరు, ధర్మవరం, పంగిడి గ్రామాలలో పంట పొలాలను సందర్శించారు. ముదునూరి సీతాద్రిరాజు ఎకరం పొలంలో కంద, ఆనబ, మామిడి, బొప్పాయి, చెరకు, పనస, పైనాపిల్, మునగ, చిలకడ దుంప, కాకర, కరివేపాకు, అరటి ఇలా పలురకాల పంటలు వేయడాన్ని పరిశీలించారు. ధర్మవరం బయోకల్చర్స్, కషాయాలు, అక్కడ పలురకాల పండ్ల మొక్కలు, గట్లపై కూరగాయల మొక్కలు వేయించమని చెప్పారు. దొమ్మేరు గాదిరాజు రామకృష్ణంరాజు 10 ఎకరాల పొలంలో అరటిలో మల్చింగ్ నవదాన్యాలు, అరటిలో పసుపు ఏవిదమైన రసాయనాలు వాడకుండా మల్చింగ్ పద్దతిలో వ్యవసాయం చేయడాన్ని గమనించారు. పంగిడి గ్రామంలో ఆర్‌డిఎస్ బ్లాకును పరిశీలించారు. దొమ్మేరులో పి.దుర్గా రవిప్రకాష్ దొండ పంటలో ఆకాకర, పొట్ల, బీర, చిలకడదుంప, వంగ, పచ్చిమిర్చి వేసిన రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. గోకృపామృతం, వేపపిండి కషాయం, మీనామృతం వాడకాలను పరిశీలించారు. రైతులంతా ఇదేవిదంగా పంటలు సాగు చేసుకుని లబ్ది పొందాలన్నారు. కార్యక్రమంలో డిపిఎం తాతారావు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

దేవరపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎం.రామకృష్ణ డిమాండ్ చేశారు. దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం బుధవారం జరిగింది. కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కన్వీనర్ రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన కార్మిక చట్టాలను రద్దు చేయాలన్నారు. కార్మికుల హక్కులు హరించే 12, 14 సర్క్యూలర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, తలారి ప్రకాశ్, సీహెచ్.నాగరాజు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ దేవకుమార్

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గోపాలపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొవ్వూరు డీఎస్పీ జీ.దేవకుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ప్రధాన కూడళ్ళు, శివారు ప్రాంతాల్లో 415 సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాద నలు చేశామన్నారు. ఆయన వెంట ఎస్ఐ కే.సతీష్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ఉండ్రాజవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల యూటీఎఫ్ శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం రాత్రి జరిగినట్లు నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు వైవీ స్వామి తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బి. రామారావు, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.లక్ష్మి నారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్. తాతారావు, అసోసియేట్ మహిళా అధ్యక్షురాలిగా ఎం.వెంకటలక్ష్మి, కోశాధికారిగా కె.రామకృష్ణ ఎన్నికైనట్టు స్వామి తెలిపారు.

గౌడ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా వరలక్ష్మి నియామకం



వరలక్ష్మిని అభినందిస్తున్న మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం గ్రామ జనసేన ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల వరలక్ష్మి రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆమె మాట్లాడుతూ తనకు డైరెక్టర్ పదవి రావడానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే శేషారావు, కూటమి నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



నల్లజర్లలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు



దేవరపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో తిరుమలదాసు

గ్రంథాలయాలు..విజ్ఞాన సంపదలు

నల్లజర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు అన్నారు. బుధవారంతో 57వ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన పోటీల్లోని విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.కృష్ణారావు, ఎంఈవో వై.సత్యనారాయణ, వల్లూరి సత్తిపండు, ఆలపాటి రామకృష్ణ, జి.సుబ్బారావు, గ్రంథాలయ నిర్వాహకురాలు ఏవి రమణ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ జీ.సుశీల, జీ.శ్రీరామూర్తి పాల్గొన్నారు.

గోపాలపురం: గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వారం రోజులుగా వాటిని పురస్కరించుకుని ప్రతీరోజు చిన్నారులకు వివిధ పోటీలు జరిపారు. ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందించారు. దాత మద్దిపాటి గంగరాజు సమకూర్చిన బహుమతులను ఎస్ఐ సతీష్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కొర్లపాటి రాము, ఎస్ఐ జ్యేష్ట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

దేవరపల్లి: విద్యార్థులు పుస్తకాలు చదవటం వల్ల విజ్ఞానాన్ని పెంచుకోవచ్చని ఎంఈవో తిరుమలదాసు అన్నారు. దేవరపల్లి శాఖ గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా జరిగిన సభకు గ్రంథాలయ అధికారి జీ.అనీత అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎంఈవో తిరుమల దాసు మాట్లాడారు. వారోత్సవాల్లో భాగంగా వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఎంఈవో బహుమతులు అందించారు. కార్యక్రమంలో యర్నగూడెం జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ ఛత్రపతి శివాజీ, ఉపాధ్యాయులు ఓరుగంటి శివరామరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



గోపాలపురంలో విద్యార్థినికి బహుమతి ఇస్తున్న ఎస్ఐ సతీష్‌కుమార్

చాగల్లు: విద్యార్థులు, యువత పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం చాగల్లు శాఖా గ్రంథాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కే.నాగేశ్వరావు, వి.గంగాధరం, ఎస్‌వీఎస్ ప్రసాద్, ఎస్.రత్నాజీ, కే.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. చంద్రవరం శాఖా గ్రంథాలయంలో జరిగిన వారోత్సవాల ముగింపులో ముఖ్య అతిథులు సూర్య పద్మకుమారి, కే.గోపి, కే.ప్రదీప్‌కుమార్, ఆర్.రమాంబ విజేతలకు బహుమతులు అందించారు. గ్రంథాలయ అధికారులు గద్దె శ్రీనివాసరావు, కే.సుమన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చాగల్లు శాఖా గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ముఖ్య అతిథులు

పాల ధర పెంచిన కృష్ణా మిల్క్ యూనియన్

నల్లజర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద నుంచి పాల సేకరణలో కృష్ణా మిల్క్ యూనియన్ మరో అడుగు ముందుకు వేసి 10 వెన్న శాతం ఉండే లీటరు పాల ధరను రూ80 నుంచి రూ82కు పెంచినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు ఘంటా నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నల్లజర్ల ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షులు చలసాని అంజనేయులు అదేశాల మేరకు గేద పాలకు రూ82 ఆవపాలకు టోటల్ సాలిడ్స్ కు రూ10 పెంచి లీటరుకు రూ1.5 పెంచినట్లు పేర్కొన్నారు.పెరిగిన పాల సేకరణ ధరలు డిశంబరు 1వ తేది నుంచి అమలులోకి వస్తాయన్నారు.

ఆర్‌టీసీ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడికి అభినందన

దేవరపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్‌టీసీ చైర్మన్‌గా రెడ్డి అప్పలనాయుడ్ని బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు జనసేన పార్టీ నాయకులతో కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలో మారుమూల పల్లె ప్రాంతాలకు పల్లెవెలుగు బస్సులను ఏర్పాటు చేయాలని చైర్మన్ రెడ్డి అప్పల నాయడుకు తెలియజేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాము పండించిన వివిధ రకాలైన కూరగాయ పంటలు తరలించేందుకు రవాణా సౌకర్యం కల్పించాలని ఆయన కోరామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అనిశెట్టి మధు, పోలుమాటి నాని, సీహెచ్ ఫణి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



అప్పలనాయుడ్ని కలిసిన గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు